



అపవిత్రం : కొవ్వూరు కనకదుర్గ రేవు వద్ద దుర్గంధం ఇలా...

శివ..శివా..



గోదారంగా ఇంతే : రాజమహేంద్రవరంలో ఘాట్ల వద్ద అధ్వానం.. రంగుమారిన నీళ్లు

- రేపు శివరాత్రి స్నానమెలా శివయ్యా..
- అధ్వానంగా రేవులు.. నాచుతో గోదారి నీళ్లు
- బుధవారం హడావుడిగా ఏర్పాట్లు



ఈ నీళ్లతో పుణ్యస్నానమా : రాజమహేంద్రవరంలో రంగుమారిన గోదావరి నీళ్లు



పట్టదా : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మెట్లపై ఇసుక మేట



పట్టించేనా : కొవ్వూరు గోష్పాదక్షేత్రం ర్యాంపులో మెట్లపై వదిలేసిన దుస్తులు

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, మార్చి 6 : గోదావరి రేవులు చూస్తే ఎవరైనా శివ శివా అనక మానరు.. ఎందు కంటే అంత అధ్వానంగా ఉన్నాయి. గతంలో శివరాత్రి వచ్చిం దంటే గోదావరి రేవులన్నీ ఈ పాటికే శుభ్రం చేసి సిద్ధం చేసే వారు.. మరి నేడు ఎక్కడికక్కడ రేవులు అధ్వానంగా దర్శనమి స్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు శివరాత్రి సంద ర్భంగా పుణ్యస్నానాలు రాజమహేంద్రవరంలో కానీ కొవ్వూ రులో చేయడం ఆనవాయితీ.. అయితే ఈ ఏడాది మాత్రం రేవులు చూస్తే భయపడక మానరు. ఎందుకంటే నేటికీ అంత అధ్వానంగా ఉన్నాయి. గోదావరిలో స్నానం చేస్తే పుణ్యం మాట అటుంచి రోగాలు వెంట వచ్చేలా ఉంది పరిస్థితి. శుక్రవారం మహాశివ రాత్రి సందర్భంగా భక్తజనం పెద్దఎత్తున్న రాజమహేంద్రవరం గోదావరి రేవులకు పుణ్యస్నానాలకు తరలివస్తారు. అయితే ఈ ఏడాది ఏర్పాట్లను అధికార యంత్రాంగం హడావుడిగా చేస్తుంది. రాజమహేంద్రవరంలో మహాశివరాత్రి పేరుచెబితే ప్రధానంగా పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులకు అధికంగా భక్తుల తాకిడి ఉంటుంది. కోటిలింగాల క్షేత్రం దక్షిణకాశీగా ప్రఖ్యాతి..ఈ మేరకు వేలాది మంది భక్తులు గోదావరిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు చేసి ఉమాకోటిలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఈ ఏడాది కోటిలింగాల రేవులో గోదావరి నీరు గతేడాది కంటే వెనక్కి ఉంది. నీరు కూడా బురదతో నిండి స్నానాలకు అను కూలంగా లేకపోవడంతో ఇప్పుడు ఆ రేవులో ఓడ్డున ఇసుకతో నింపుతున్నారు. అదే రేవులో ఉన్న జల్లు షవర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాటిలో పనిచేసేవాటిని తాత్కాలికంగా సిద్ధం చేస్తున్నారు. చింతాలమ్మ ఘాట్, దుర్గమ్మఘాట్లలో బంకమట్టి దిబ్బలు వేసి పిచ్చి మొక్కలతో నిండి స్నా నం చేసేందుకు అనువుగా లేదు. పుష్కరాలరేవులో నీరు నాచు పట్టిపోయింది. మార్కండేయ ఘాట్‌లోను ఇసుక వేశా రు. గౌతమి ఘాట్ అధ్వానంగా ఉంది. బోర్డులు పెట్టారు అక్కడ నీళ్ళు లేవు. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో శుభ్రత లేదు. చాలా చోట్ల నీటిపై నాచు పేరుకుపోయింది. వాటిని శుభ్రం చేయాల్సి ఉంది. లేదంటే పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు జారిపడి ప్రమాదాల బారిన పడతారు. అపరకర్మలు నిర్వహించిన భక్తులు గోదావరి నదిలో పున్యస్నానాలు ఆచరించి బట్టలను అక్కడే వదిలివేయడంతో స్నానఘట్టాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. కనకదుర్గమ్మ ఆలయం ఎదుట గోదావరి నదిలో పూజాద్రవ్యాలు, వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అయితే అధికారులు మాత్రం ఏర్పాట్లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. శివరాత్రికి ఒకే రోజు ముందు బుధవారం పనులు ఆఘమేఘాలపై చేయిస్తున్నారు. దీంతో భక్తులకు అసౌకర్యం తప్పదు మరి.



వంగలపూడి వయా పట్టిసీమ

సీతానగరం,మార్చి 6 : మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం వీరేశ్వరుడిని దర్శించుకునేందుకు వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు వంగలపూడి మీదుగా ఇసుకలో నడచుకుంటూ గుడికి వెళతారు.ఈ మేరకు గోదావరి నదికి అడ్డుకట్టవేసి ఇసుకతో రోడ్డు వేసి మార్గం సుగమం చేశారు. భక్తులకు మంచినీటి వసతితో పాటు ,ఉచిత భోజన సదుపాయాలు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ కొంచ అన్నపూర్ణ ,కొంచ చం ద్రభాస్కరరావు తెలిపారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

కలిసిన గోరంట్ల- దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో టీడీపీ. జనసేన అధినేతలు తీసుకున్న నిర్ణయాల విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ఒక మాట మీదకు వచ్చారు. తొలి జాబితా ప్రకటించిన నాటి నుంచి ఈ సీటు విషయంలో ఇద్దరు నేతలు కాస్త ఎడమొఖం, పెడ ముఖంగా ఉన్న సంగతి తెలిసిందే. జనసేన అధి నేత దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయాలని చెప్ప డంతో ఆయన నిడదవోలు నుంచి.. గోరంట్ల రూరల్ నుంచి పోటీ చేయడం ఖాయమైంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పలువురు నాయకులతో కలిసి దుర్గేష్ ఆఫీసుకువెళ్లి ఆయనతో ఆత్మీయంగా సమావేశం అయ్యారు.ఇద్దరు పలు విషయాలను స్పష్టంగా మాట్లాడుకున్నట్టు సమాచారం. చివరకు ఇద్దరూ ఒకమాట మీద కు వచ్చినట్టు సమాచారం. దీంతో రూరల్ సీటు విషయంలో నెలకొన్న అనిశ్చితి తొలగినట్టు అయింది. నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శేషారావుకు నచ్చచెప్పే బాధ్యత టీడీపీ అధిష్టానం తీసుకుంది.కొద్దిరోజుల్లో ఆయనతో అధిష్టానం మాట్లాడనుంది.ఇక రూరల్,నిడదవోలు స్థానాలకు గోరంట్ల,దుర్గేష్ పేర్ల టీడీపీ,జనసేన అధిష్టానాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నాయి.ఆ వెంటనే దుర్గేష్ నిడదవోలులో అధికారికంగా ప్రచారం ప్రారంభిస్తారు.

425 మంది టీచర్లకు రెండు నెలలుగా జీతాల్లేవ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలతో పాటు ఎయిడెడ్, గవర్నమెంట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి గత రెండు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ) గా ఉన్న రాజమహేంద్రవరం ఏలూరు ,కాకినాడ ప్రాంతాల్లో డీఐల నుంచి ఎంఈవోలకు ఉద్యోగాల జాబితా బదలాయింపులు జరిగాయి. అయితే ఇందులో ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేసే సెంట్రలైజ్డ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో రాజమహేంద్రవరానికి సంబంధించిన 425 మంది ఉపాధ్యాయులు పేర్లు కనిపించకుండాపోయాయి. దీంతో ఇబ్బందులు తలెత్తాయి. గత రెండు నెలలుగా ఈ సమస్యకు కొలిక్కిరాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు వెంటనే విడుదల చేయాలని బుధవారం రాజమహేంద్రవరంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, రాష్ట్ర మాజీ కార్యదర్శి వంరుల అప్పయ్యశాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్‌లు డీఈవో వాసుదేవ రావును కలిసి వినతిపత్రం అందించారు.దీనిపై స్పందించిన డీఈవో రెండు ,మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

20 నుంచి నరసన్న ఉత్సవాలు

కోరుకొండ, మార్చి6: చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారి రథశాల నుంచి అతి పెద్ద రథాన్ని పండితులు నిర్ణయించిన సుమూహుర్తానికి బయటకు తీశారు. ముందుగా ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు స్వామి వారి రథానికి పూజలు చేశారు. అనంతరం రంగరాజభట్టర్ కొబ్బరికాయ కొట్టగా గ్రామస్తులు రథాన్ని రథశాల నుంచి బయటకుతీశారు.ఈ రథానికి మరమ్మతులు, ఆలంకరణ, రంగులు అద్దడం, వంటి పనులు చేసి 15 రోజులు తరువాత జరిగే రథోత్సవానికి సిద్ధం చేస్తారని రంగరాజభట్టర్ తెలిపారు.




భూపాలపట్నంలో పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ, ఆర్డీవో

జిల్లాలో 170 పాలసేకరణ కేంద్రాలు
జిల్లా కలెక్టర్ మాధవీలత

దివాన్‌చెరువు, మార్చి6 : జిల్లాలో 170 పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజానగరం మండలం భూపాలపట్నంలో బీఎంసీయూను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతుకి వ్యవసాయంతో బాటు పాడి ఉంటే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాన్నారు.ఈ మేరకు ఆమూల్ కేంద్రాల ద్వారా మద్దతు ధరకి పాలని సేకరించడం జరుగుతోందని చెప్పారు. సంపత్‌నగరం గ్రామంలో ఎమ్మెల్యే రాజా, జేసీ తేజ్‌భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పాలసేకరణ కేంద్రం ప్రారంభించారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రాధాకృష్ణ, డి.డి. డాక్టర్ ఎం.వెంకటేశ్వ రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ గిరీకో.. దండం



అలంకారంగా కార్పొరేషన్ చైర్మన్ పదవులు

- వైసీపీ ఉత్తుత్తి కార్పొరేషన్లు
- పనికి రాని చైర్మన్ పదవులు
- చైర్మన్లకు కుర్చీలు లేవు.. గౌరవం లేదు
- బీసీలకు 56 కార్పొరేషన్లు
- ఒక్క రూపాయి విధల్చని జగన్
- జిల్లాకు రెండు చైర్మన్ పదవులు
- ఇతర కార్పొరేషన్లదీ ఇదే పరిస్థితి

రాజమ హేంద్రవరానికి చెందిన సంకిస భవానీప్రియకు రాష్ట్ర గాండ్లతెలకులు,దేవతిలకుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. రాష్ట్రంలో ఈ సామాజికవర్గం ప్రజలు సుమారు 10 లక్షల మంది ఉంటారనేది అంచనా. కానీ వీరికి ఒరిగిందేమీ లేదు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన చైర్మన్ అయినప్పటికీ ఈ ప్రాంతానికి కూడా చిన్న మేలు చేయ లేని పరిస్థితి. చాలా మందికి తమకో చైర్మన్ ఉన్నారనే విషయం కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలకుల సామాజికవర్గం వారు కరెంట్‌తో గానుగులు తిప్పుకోవడానికి 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశారు. పనిచేయలేని స్థితిలో ఉన్నవారికి పింఛన్లు ఇవ్వాలని కోరారు. కానీ ఇంత వరకూ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కార్పొరేషన్‌కు చైర్మన్ పదవితో పాటు 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. అయితే ఏం లాభం చైర్మన్‌గా ఉన్నా వారి కులానికి సంబంధించి ఒక్క పనీ చేసుకోలేని దుస్థితి. మిగిలిన కార్పొరేషన్లదీ ఇదే పరిస్థిది.. చైర్మన్ పదవులన్నీ అలంకార ప్రాయంగానే మిగిలాయి.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బీసీలకు వైసీపీ ఏం చేసింది.. కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది అంతే.. ఆ కార్పొరేషన్లతో ఏం చేశారంటే ఏమీ లేదు.. ఆయా కార్పొరేషన్లకు చిల్లిగవ్వ కూడా విదల్చ లేదు. 56 బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను కేటాయించ డంతో ఆరంభంలో ఆహా జగన్.. ఓహో జగన్ అన్నారు. నేడు వారంతా ఎక్కడ ఉన్నారో కానరాని పరిస్థితి. ఎందుకంటే వారికి నిధులు లేవు.. విధులు లేవు.. కనీసం కుర్చీ కూడా లేదు. పేరుకే కార్పొరేషన్.. పేరుకే చైర్మన్.. కులాల వారీ ప్రజలను ఉద్ధరిస్తానని చెప్పి బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ప్రకటించిన వైసీపీలో వారికి కనీస గౌరవం దక్కలేదు. బీసీలకు నామమాత్రపు పదవులు కట్టబెట్టి ఊరేగుతోంది. కొంతమందికి పదవులైతే వచ్చాయి. కానీ వాళ్ల చేతిమీద వారి సామాజిక వర్గానికి చిన్న మేలు కూడా చేయలేని దుస్థితి. గత తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేసింది. పైకి బీసీల మీద కపట ప్రేమను చూపిస్తోంది.

56 బీసీ కార్పొరేషన్లు..

బీసీలలో 130కు పైగా కులాలు ఉన్నప్పటికీ, వాటిలో 56 కులాలకు నామమాత్రంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లు పదవులు ఇచ్చారు. కానీ వీరు కూర్చోవడానికి కుర్చీలు లేవు. గొల్లపూడిలో నామ మాత్రం 56 కార్పొరేషన్లకు ఓ భవనం చూపించి అవే మీ కార్యాలయాలు అని చెప్పడంతోనే సరిపోయింది. జిల్లాలో రెండు బీసీ వర్గాలకు కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఇచ్చారు. జనవరి నాటికే ఏడాది పూర్తయింది. కనీసం ఒక్క పథకం కూడా అమలు కాలేదు. వారికి మళ్లీ పదవీకాలం పొడిగించారంతే. కనీసం ఎన్నికల ముందు వీరికి నిధులివ్వలేదు. నిధులు రాక.. విధులు లేక ఇతర కులాల కార్పొరేషన్లకు చెందిన కొందరు విసుగుచెంది పదవులకు రాజీనామా చేశారు. కార్పొరేషన్ చైర్మన్లకు ఆరంభంలో ఒకటి రెండు సార్లు మూడు నెలలకొకసారి గౌరవ వేతనం ఇచ్చారు. తర్వాత అదీ లేదు.ఎందుకీ పదవులనే బాధ వారిలో గూడు గట్టుకుంది..చైర్మన్ పదవి ఉన్నవారు ఏదో గౌరవం ఉందని తిరుగుతున్నారు.సొంతడబ్బులు పెట్టుకుని తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.ఈ పదవులతో ఎవరికీ మేలు చేసేఅవకాశం లేకపోవడంతో అలంకారంగా మిగిలాయి.

ఇదీ కార్పొరేషన్ చైర్మన్ల దుస్థితి...

జిల్లాలో గోపాలపురం ప్రాంతానికి చెందిన ఇళ్ల భాస్కరరావును అతిరాస కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.రాష్ట్రంలో ఈ వర్గం జనాభా కేవలం వేలల్లో ఉంటుంది. వీరంతా పేదలే..ఈ కార్పొరేషన్ వల్ల వీరికి మేలు జరుగుతుందని అందరూ భావించారు. కానీ ఒక పథకం అమలు చేయలేదు. ఒక్క రుణం ఇవ్వలేదు.దీంతో సదరు చైర్మన్ ఏదో చైర్మన్‌గా ప్రచారం చేసుకోవడం తప్ప అతని వల్ల ఈ సామాజిక వర్గానికి ఒరిగిందేమీ లేదు. చాగల్లుకు చెందిన సినీ నిర్మాణ కొరారుఅశోక్‌బాబు కొంత కాలం కిందట కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఏదో చేయవచ్చని ఆయన మొదట ఆనంద పడ్డారు.వాస్తవం తెలిసిందే. దీని ద్వారా ఏమీ చేయలేమని అర్థం చేసుకుని కొద్ది నెలల కిందట ఈ పదవికి రాజీనామా చేసి, హైదరాబాద్‌కు వెళ్లిపో యారు. బురిడి పద్మావతి తూర్పుకాపు కార్పొ రేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె కూడా ఏమీ చేయలేని పరిస్థితి. పిల్లి నిర్మల,కానుబోయిన సాగర్, మార్తి లక్ష్మి వంటి వారికి వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు వచ్చాయి. కానీ అవన్నీ అలంకార ప్రాయంగానే మిగిలి పోయాయి.ఇవే కాదు. ఇతర కులాల కార్పొరేషన్లు పరిస్థితి అంతే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు అసలు పనే లేదు.

నిధుల్లేని బ్యూటిఫికేషన్ కార్పొరేషన్

వైసీపీ ప్రజలనే కాదు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలను మోసం చేసింది. మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ కుమారుడు చందన నాగేశ్వర్‌ను వైసీపీ నేతలు కొంతమంది బలవంతంగా రాజకీయాల్లోకి తెచ్చారు. ఎమ్మెల్యే సీటు నీదేనని చెప్పి రూరల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. తర్వాత లేని కార్పొరేషన్‌కు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చైర్మన్ అని ఓ పదవి ఇచ్చారు. అది వట్టిదని తేలడంతో.. బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు.కానీ ఈ కార్పొరేషన్‌కు సొంతంగా నిధుల్లేవు. మునిసిపల్ కార్పొరేషన్ నిధులిస్తే తన పేరిట పార్కులు చేస్తుంది. ఈ పనులు మున్సిపల్ కార్పొరేషన్ సొంతంగా చేసుకోవాలి. కానీ వైసీపీ పెద్దల ఒత్తిడి వల్ల నిధులిచ్చి పనిచేస్తూ ఈ పని బ్యూటిఫికేషన్ పేరిట చేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. దీంతో అదనంగా ఇతరులకు కమీషన్లు ఇవ్వడంతప్ప మరో ప్రయోజనం లేదు. ఇటీవల రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ పదవిని మేడపాటి షర్మిళారెడ్డికి ఇచ్చారు. ఆమెకు రుడా రెండో సారి ఇచ్చి క్యాన్సిల్ చేసి మరీ ఈపదవి ఇచ్చారు. కానీ ఇంత వరకూ పైసా పనిచేసే అవకాశం ఆమెకు దక్కలేదు. ఇదీ వైసీపీ కార్పొరేషన్ల బండారం. ఏదో పదవి ఉన్నట్టు చెప్పుకోవడానికే పనిచేస్తోంది. ప్రభుత్వం ఏదో ఒకరికో ఇద్దరికో పార్టుటైం ఉద్యోగాలు ఇచ్చినట్టుగా ఈ పదవులను అంట గట్టింది తప్ప. ప్రయోజనం ఏమీ కనిపించడంలేదని అందరిలోనూ అంతర్మథనమే.

టీపొడి రీప్యాకింగ్.. రెండు కేసులు నమోదు



రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీపొడిని హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి రిటైల్‌గా ప్యాకింగ్ చేసే దుకాణాల్లో విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తనిఖీలు చేశారు. నందిని టీ ట్రేడర్స్‌లో సోదాలు చేయగా సింథటిక్ ఫుడ్ కలర్‌ను టీపొడి రంగును కృత్రిమంగా మెరుగుపరచడానికి కలుపుతున్నట్టు గుర్తించామన్నారు. టీపొడిని కల్తీ చేయడానికి ఉపయోగిస్తున్న టార్టాలిన్ 1.4 కిలోలు, సన్‌సెట్ పసుపు 4 కిలోలు, బ్రిలియంట్ బ్లూ పావుకిలో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ఇప్యాకింగ్, కన్స్యూమర్ కేర్ వివరాలు లేవన్నారు. దీంతో రెండు కేసులు నమోదు చేశామని ఎస్పీ చెప్పారు. వాణిజ్య అవసరాలకు వాడుతున్న 4 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. భారతి ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేసి ప్యాకింగ్ వివరాలు లేకపోవడం గుర్తించామన్నారు. ఆ సంస్థపై కూడా రెండు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు,సిబ్బంది నాగ వెంకటరాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం పొగాకుబోర్డులో పొగాకు పరిశీలిస్తున్న బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, ఆర్ఎం ఆదిశేషయ్య

ఈ ఏడాది 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గోపాలపురం, మార్చి 6: బోర్డు నిబంధనలకు లోబడి పొగాకుసాగు చేయడం ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయవచ్చని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గతేడాది బోర్డు అనుమతికి మించి అదనపు పంట పండించినప్పటికి రైతుఉలకు ఆశాజనకమైన ధరలను కల్పించామన్నారు. ఈ ఏడాది 9.9 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు అనుమతివ్వగా 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామన్నారు. రైతులు అదనంగా పండించే పంటపై అపరాధరుసుంపై ఆందోళన చెందవద్దన్నారు. సరాసరి గిట్టుబాటు ధర కల్పించే విధంగా కంపెనీ ప్రతి నిధులతో ఢిల్లీ స్థాయిలో సంప్రదింపులు చేస్తామన్నారు. రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పొగాకుబోర్డు మాజీ డైరెక్టర్ గద్దే శేషగిరిరావు, రాజేంద్రప్రసాద్ తదితర రైతులు ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పొగాకు రైతులకు ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. బోర్డు చొరవతో కొనుగోలు స్థాయిని పెంచి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య,ఆక్షన్ సూపరింటెండెంట్ శ్యామ్, ఎస్‌జీవో హేమస్మిత, పిన్నమనేని మధుమోహన్, జగదీష్, నందమూరి సత్యనారాయణ, ఉండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో కేజీ రూ.240

దేవరపల్లి, మార్చి 6: పొగాకు ధరలు రైతులను నిరాశపరిచాయి. ఈ మేరకు పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు వేలం ప్రారంభమైంది. చెరుకుమిల్లి గ్రామానికి చెందిన 18 పొగాకుబేళ్ళు వేలానికి వచ్చాయి. వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ వేలం నిర్వహించారు. గరిష్ట ధర కిలో రూ.240 ధర పలికింది.ఈ ఏడాది కిలో సరాసరి ధర రూ.300 ఉంటేనే కానీ గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొగాకు కంపెనీ ప్రతినిధులు ఐటీసీ ప్రతినిధి కోట్రిస్, పీఎస్ఎఫ్ కంపెనీ ప్రతినిధి సీతారామరాజు,మరో 6కంపెనీల ప్రతినిధులు, రైతులు యాగంటి సాయిబాబు, కరుటూరి శ్రీనివాస్, రాజేంద్రబాబు, కాట్రు భీమరాజు, దుద్దుకూరి హరిబాబు,కాట్రు వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న సర్పంచ్ హిమబిందు అత్తమామలు

పంచాయతీలను నాశనం చేసిన సీఎం జగన్

- సొంత నిధులు రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాల్
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణం
- పడమర చోడవరం సర్పంచ్ హిమబిందు

నల్లజర్ల,మార్చి 6 : వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌గా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని పడమర చోడవరం సర్పంచ్ పెండ్యాల హిమబిందు చందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో సొంత నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం సర్పంచ్ భర్త చందు తల్లిదండ్రులు పెండ్యాల నరసింహమూర్తి,నాగరత్నం దంపతులు ప్రారంభించారు. సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ నుంచి నిధుల్లేకపోవడంతో తామే స్వయంగా రూ.12 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించినట్టు చెప్పారు.రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన పార్టీలను గెలిపించుకోవాలన్నారు.గ్రామ పంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్ పార్టీని ఓడించాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి,కూచిపూడి వెంకటేశ్వరరావు, ఆలపాటి వెంకట సుబ్బారావు, మద్దిపాటి సుబ్బారావు,ఉప్పు నరేష్,ఉండవల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శివరాత్రికి సన్నద్ధం

- శైవాలయాల్లో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక ఆకర్షణ
- ప్రత్యేక శోభను సంతరించుకున్న ద్రాక్షారామ, కోటిపల్లి క్షేత్రాలు
- క్యూలైన్ల ఏర్పాటు





ద్రాక్షారామకు ప్రత్యేక శోభ

ద్రాక్షారామ, మార్చి 6: త్రిలింగ క్షేత్రం, పంచారామం, దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయం శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవానికి సిద్ధమయ్యింది. ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి వారు స్వయంభువునిగా కొలువుదీరారు.. మాణిక్యాంబ అమ్మవారు అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్నారు. శివరాత్రి పర్వదినాన సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరాలయంలో శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, ప్రాత:కాలార్చన, తీర్థపుబిందె, ప్రథమ అభిషేకం, బాలభోగం కార్యక్రమాలు జరుగుతాయి. 4.00 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భీమేశ్వరస్వామి వారికి భక్తులచే అభిషేకములు, ఏకాదశ రుద్రహోమం. పూజలు జరుగుతాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ జరుగుతుంది. రాత్రి 10.30 గంటలకు స్వామివారి రాజభోగం నిమిత్తం 11 నుంచి రాత్రి 12 గంటల వరకు స్వామి దర్శనానికి విరామం. 12 గంటల నుంచి రాత్రి 1.30 వరకు స్వామి దర్శనానికి అనుమతిస్తారు. ఆలయానికి తరలి వచ్చే అశేషమైన భక్తులకు స్వామి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత, శీఘ్ర, విశిష్ట దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ అధికారి, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. భక్తులకు సేవలు అందించేందుకు పరిసర ఆలయాల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. పైండా వారి అన్నసత్రంలో అన్నదానం జరిపేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.



కోటి ఫలితాలనిచ్చే క్షేత్రం

కె.గంగవరం, మార్చి 6: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటిఫలితాలు సిద్ధిస్తాయని ప్రజల విశ్వాసం. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారు, భూదేవి సమేత సిద్ధి జనార్దనస్వామి, కోటేశ్వరస్వామి, నవగ్రహాలయం ఉన్నాయి. ఆలయం వెలుపల గోశాల ఏర్పాటు చేశారు. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి పర్వదినాన సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలివే..

7 నుంచి 9వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7 గురువారం ఉదయం 5 గంటలకు గౌతమి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామి వారికి బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 4.30 లకు స్వామి వారి రథోత్సవం, 8వ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మేళ తాళాలతో గోదావరి నదిలో నుంచి తీర్థపు బిందెను తీసుకువచ్చిన అర్చకులు స్వామి వారికి అభిషేకము, బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు 4 గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. రాత్రి 7 గంటలకు బేడా మండపంపై కోటి దీపార్చన, రాత్రి 9 గంటలకు లక్షపత్రి పూజ నిర్వహిస్తారు.

వాహనాల దారి మళ్లింపు

శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు పామర్రు ఎస్‌ఐ జానీబాషా తెలిపారు. 7 గురువారం రాత్రి 9 గంటల నుంచి రావులపాలెం నుంచి యానాం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కూళ్ల గ్రామం నుంచి పామర్రు, గంగవరం గ్రామాల మీదుగా, యానాం నుంచి రావులపాలెం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కోట గ్రామం నుంచి గంగవరం, పామర్రు గ్రామాల వైపుగా మళ్లిస్తున్నారు. అదే విధంగా కాకినాడ నుంచి అమలాపురం వైపుగా గోదావరి పంటుపై ప్రయాణం చేసే వాహనాలను పాతకోట ఏటిగట్టు నుంచి దంగేరు మీదుగా యానాం వైపునకు, అమలాపురం నుంచి కాకినాడ వైపునకు గోదావరి పంటు దాటే వాహనాలను ముక్తేశ్వరం నుంచి యానాం వైపుగా దారి మళ్లిస్తున్నట్లు ఆయన చెప్పారు. కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం రేవులో ప్రయాణికులను మాత్రమే దాటిస్తామని చెప్పారు. రేవు ట్రాఫిక్ నియంత్రణ ఉన్నందుకు వాహనదారులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మహా పుణ్యక్షేత్రం
కుండలేశ్వరం

కాట్రేనికోన, మార్చి 6: కుండలేశ్వరం వచ్చి వృద్ధగౌతమిలో స్నానం చేసి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీ పండితులు అంటుంటే తాను ఎంతో ఆశ్చర్యపోయానని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానించారంటే కుండలేశ్వర మహాత్మ్యం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అందుకే చాగంటి తరచూ కుండలేశ్వరంలో పూజలు నిర్వహించడమే కాకుండా స్వయంగా ఆయన ఇక్కడ కొన్ని నిర్మాణాలను చేపట్టారు. అమలాపురానికి సమీపంలో వృద్ధగౌతమీ నదీ తీరాన వెలసిన కుండలేశ్వరం క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమ మహాముని ప్రతిష్ఠించడం విశేషం. బ్రహ్మాండ పురాణంలో వ్యాసమహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. ఇప్పటికీ అర్ధరాత్రి వేళ ఈ క్షేత్రం సమీపంలో నదీ గర్భంలో ఓంకార నాదాలు వినిపిస్తాయని అంటుంటారు. ఈ ఆలయాన్ని అర్చకులే అభివృద్ధి చేయడం మరో విశేషం. కాశకూరి కుటుంబం ఆలయ అభివృద్ధికి పాటుపడుతోంది. మహాశివరాత్రి రోజున ఎందరో భక్తులు కుండలేశ్వరం వచ్చి స్వామిని దర్శించుకుంటారు. అయితే ఇక్కడ నదీతీరం ప్రమాదకరంగా ఉంది. భక్తుల కోసం ఇక్కడ శాశ్వత స్నానఘట్టాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.



ఘనంగా కుక్కుటేశ్వరుని కల్యాణం



కుక్కుటేశ్వర స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు, ఎంపీ గీత



పిఠాపురం, మార్చి 6: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. వేద పండితులు చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పట్టువస్త్రాలు, మంగళసూత్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబుతో పాటు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

మండపేట, మార్చి 6: మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో విఘ్నేశ్వర మోడ్రన్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.35,15,687 విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. సివిల్ సప్లయి అధికారులతో కలిసి తాపేశ్వరంలో ఉన్న రైస్ మిల్లును తనిఖీ చేస్తుండగా వెలగతోడు గ్రామానికి చెందిన ఏరుబడి సురేష్ ద్విచక్ర వాహనంపై 120 కిలోల రేషన్ బియ్యం విక్రయించేందుకు తీసుకువచ్చాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వెలగతోడులో రేషన్‌కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.16 వంతున కొనుగోలు చేసి మిల్లు వద్ద రూ.20కి విక్రయిస్తున్నట్లు చెప్పాడు. తాపేశ్వరంలో రైస్‌మిల్లు నిర్వాహకుడు అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కర్రి దత్తాత్రేయ గురుకృష్ణారెడ్డి తానే రేషన్ బియ్యంను కొనుగోలు చేసినట్టు అంగీకరించారని అధికారులు తెలిపారు. మిల్లులో రికార్డులను పరిశీలించగా లభ్యం అయిన 267.87 క్వింటాళ్ల బియ్యం, సుమారు రూ.35,15,687 వరకు బియ్యం విలువ ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో లభ్యమైన వాహనాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసి బియ్యం విక్రయించే వ్యక్తితో పాటు, మిల్లు యజమానిపై కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. దాడుల్లో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి, మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు నిల్వలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు. నాగవెంకటరాజు, విజయ్‌కుమార్, జగన్నాథరెడ్డి, సీఎస్‌డీటీ అలీషా పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, మార్చి 6: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నార్కెడుమిల్లి రామకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు వేదాశీర్వచనం అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మన్యం సూర్యకుమారి భాను, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,00,144 లభించింది.

నేడు ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

అన్నవరం, మార్చి 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులను గురువారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ స్కీం ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి. 8 ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న నిధులను ఎట్టకేలకు రూ.90 కోట్ల నుంచి ముందుగా రూ.50 కోట్లకు కుదించి చివరగా రూ.20 కోట్లతో సరిపెట్టారు. ఈ నిధులను టీటీడీ సత్రం ప్రదేశంలో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వద్ద మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులకు ఖర్చు చేయనున్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమాలను వార్షిక కల్యాణవేదిక ప్రాంగణంలో చేపట్టనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. 11.30కి ఎమ్మెల్యే, ఎంపీల ప్రసంగం అనంతరం 11.45కు ప్రధాని మోదీ ప్రసంగం వర్చువల్‌గా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మార్చి6: తుని రైల్వేస్టేషన్ పరిధిలో హంసవరం, అన్నవరం రైల్వేస్టేషన్ల మధ్యలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తె లిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.82 కోట్లు

అన్నవరం, మార్చి 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,82,53,964 నగదు, 19 గ్రాముల బంగారం, 1580 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యుఎస్‌ఏ 137 డాలర్లు, సింగపూర్ 39, సెంట్రల్‌బ్యాంక్ ఒమెన్ 800 లభించాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 34 రోజులకు ఈఆదాయం సమకూరగా స్వామివారికి సరాసరిన రోజుకు రూ.5.07 లక్షలు హుండీలలో కానుకలను భక్తులు సమర్పించారు.

అంగరంగ వైభవంగా భీమేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

- శోభాయమానంగా సామర్లకోట ఆలయ ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

సామర్లకోట, మార్చి 6: కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి వేలాదిమంది భక్తుల నడుమ, వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవాన్ని ఆలయ పండితులు శ్రీపాద రాజశేఖర్ ఘనాపాఠి, వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే స్థానిక చంద్రశేఖరస్వామి ఆలయం నుంచి పండితులు పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణ ప్రక్రియ కథ వృత్తాంతాన్ని తణుకుకు చెందిన పండితులు శర్మ సమగ్రంగా వివరించారు. కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు అందజేశారు. ఆ కల్యాణోత్సవంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, దవులూరి సుబ్బారావు, బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు, కటకం సతీష్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణ పూజల అనంతరం హాజరైన భక్తులకు ప్రసాదాలు, కల్యాణ ముత్యాల తలంబ్రాలు, రుమాళ్లను భక్త సంఘం పంపిణీ చేసింది. ఈ కల్యాణోత్సవంలో అమలకంటి శ్రీనివాసరావు, కంచర్ల నాగజగన్నాథ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రెండో స్థానంలో కాకినాడ టౌన్ బ్యాంకు

ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర



సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర తదితరులు

కాకినాడ సిటీ, మార్చి 6 : తమ బ్యాంకు మొత్తం టర్నోవర్ రూ.1740 కోట్లుగా ఉందని, రాష్ట్రంలో ఉన్న అర్బన్ బ్యాంకుల్లో కాకినాడ టౌన్ బ్యాంకు 2వ స్థానంలో నిలిచిందని ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడించారు. కాకినాడ గాంధీనగర్ యూనివర్శల్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర బ్యాంకు ఆర్థిక లావాదేవీల వివరాలు తెలియజేశారు. రిజర్వ్ బ్యాంకు వారి కేటగిరైజేషన్ ప్రకారం టైర్-3 బ్యాంకుగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఖాతాదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇటీవలే ఫోన్-పే, గూగుల్-పే సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. గత నెల ఫిబ్రవరి 29 నాటికి బ్యాంకు నెట్ ఎన్‌పీఏవో-91గా, సీఆర్‌ఏఆర్ 18.27 శాతంగా ఉందన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ తోట సుధీర్, డైరెక్టర్లు గారపాటి అచ్యుత కల్యాణ్‌ప్రసాద్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, అయ్యగారి వెంకటేష్, బ్యాంకు సభ్యులు పి.కృష్ణ, ఎన్ జనార్ధనరెడ్డి, బ్యాంకు సీఈవో సి.సుగుణరావు, అసిస్టెంట్ ఎల్‌టీవో బి సుహాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వేళ విలేకర్లకు తాయిలాలు

గిఫ్ట్ బాక్సులు పంపిణీ చేసిన ఎంపీ భరత్





రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ వైసీపీ నాయకుల ప్రలోభాల పర్వం నిస్సిగ్గుగా నడుస్తోంది. తూర్పు గోదావరి జిల్లా రాజ మహేంద్రవరం రూరల్ వైసీపీ ఇన్‌చార్జి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సమాచార శాఖ వాహనంలో గిఫ్టులను తరలించి ఏకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వాటిని వలంటీర్లు, ప్రభుత్వ, సచివాలయ సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడానికి వినియోగించారు. నేనేం తక్కువ తిన్నానా అంటూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎంపీ భరత్ రామ్ విలేకరులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో కొంత మంది రిపోర్టర్లకు చీర, ప్యాంటు షర్టు బిట్లు ఉన్న సంచిని అందజేశారు. ఒక్కో ప్యాక్ విలువ సుమారు రూ.3 వేలు ఉంటుంది. అప్పుడు కొంత మందికి అందకపోవడంతో వారికి బుధవారం ఇచ్చారు. ఈ గిఫ్టులను వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి పంపించారని చెబుతున్నారు. నెల కిందట జిల్లా వైసీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా రిపోర్టర్లకు కాస్త పెద్ద మొత్తం విలువ చేసే గిఫ్టులను చేతికిచ్చారు. కొందరికి ఇళ్లకు తీసుకెళ్లి మరీ అందజేశారు. అవి కూడా వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి వచ్చాయని సమాచారం. ఆ గిఫ్టుప్యాక్‌లో ఇయర్ ఫోన్లు, పవర్‌బ్యాంకు, ట్రైపాడ్, వాచీ.. ఇలా సుమారు రూ.8-10 వేలు విలువ చేసే వస్తువులు ఉన్నాయి. సుమారు 30 మందికి వీటిని పంచారు. వైసీపీ నుంచి సీటు ఆశిస్తున్న నాయకులు వలంటీర్లు, మీడియా, సచివాలయ సిబ్బంది, అంగ న్వాడీలు, ఆశా వర్కర్లకు ఎక్కడికక్కడ గిఫ్టులు ముట్టజెబుతున్నారు. తమకు అనుకూలంగా పని చేయాలని మౌఖికంగా హుకుం జారీ చేస్తున్నారు. అంతా బహిరంగంగా చేస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వదిలేయడం గమనార్హం.

మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు

పిఠాపురం, మార్చి 6: మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తీర్పు చెప్పారు. భార్యను చంపిన కేసులోనూ అతను ముద్దాయిగా ఉన్నాడు. పిఠాపురం పట్టణంలోని లయన్స్ కల్యాణమండపం ఏరియాలో నివాసముండే కేతినీడి ఉమాదేవి(71) తన కుమార్తె ఆళ్ల హేమమాలిని, అల్లుడు ఆళ్ల నారాయుడితో కలిసి జీవించేది. 2017 మార్చి 17వ తేదీన ఉమాదేవి అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే ఉమాదేవితో కుమార్తె, అల్లుడు ఆస్తి విషయంలో గొడవపడినట్లు, దీంతో ఆమె మృతిపై తమకు అనుమానం ఉందని ఉమాదేవి సోదరుడు అడబాల ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్‌ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ బోను అప్పారావు దర్యాప్తు చేసి కుమార్తె, అల్లుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణలో ఉండగానే ఆళ్ల హేమమాలిని 2022లో హత్యకు గురయింది. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ప్రధాన నిందితుడైన నారాయుడికి 302 సెక్షన్ కింద జీవిత ఖైదు, వేయి రూపాయల జరిమానా, 201 సెక్షన్ కింద 5 సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయిలు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా జీవితఖైదు పడిన నారాయుడు తన భార్యను హత్య చేసిన కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు చేసిన అధికారులతో పాటు స్పీడ్ ట్రైల్ అయ్యేలా చూసిన పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్, ఏఎస్‌ఐ వి.దుర్గారావు, పీపీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

టెంట్‌హౌస్ దగ్ధం: రూ.15 లక్షల నష్టం

ఆత్రేయపురం, మార్చి 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించి టెంట్‌హౌస్ దగ్ధమైంది. చిట్టూరి ఊదరాజు సొసైటీ గోదాము సమీపంలోని తాటాకు పాకలో సప్లయి కంపెనీ నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంలో ఆటో, మూడు జనరేటర్లు, ఒక మోటారు సైకిల్, విలువైన సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

సీతానగరం, మార్చి 6: గంజాయితో తమిళనాడుకు చెందిన వ్యక్తిని బుధవారం సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. సీతానగరం ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు పురుషోత్తపట్నం లాంచి రేవు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని విచారించగా అతని వద్ద గల బ్యాగ్‌లో 8 కిలోల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సరుకును స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని విచారించగా తమిళనాడు లోని దిండిగల్‌కు చెందినవాడిగా గుర్తించారు. సరుకు విలువ రూ.30 వేల వరకు ఉండవచ్చునని తెలిపారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రాచీన గ్రంథాల డిజిటలైజేషన్

రాజమహేంద్రవరం,కల్చరల్,6 మార్చి: గౌతమి గ్రంథాలయంలో ప్రాచీన గ్రంథాలను డిజిటలైజేషన్ చేసిన డా.అరిపిరాల నారాయణరావు అభినందనీయులని శాస్త్రనిధి విశ్వనాథ గోపాల కృష్ణశాస్త్రి అన్నారు. గౌతమిగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దీక్షితులకు డిజిటలైజేషన్ హార్డ్‌డిస్క్ అందజేశారు. శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గుడా నిధులతో పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. శ్యామ్‌నారాయణ, తల్పశాయి, డా.జి.సత్యదేవ్, డి.ఎస్.ప్రసాదరావు, ప్రసాదుల హరినాథ్,నాళం పద్మశ్రీ, డా.ఆర్.ఎస్.వెంకటేశ్వరరావు డా.కూర్మయ్య పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కోర్టు ప్రారంభం



గిరిజన సంప్రదాయ నృత్యంతో పీవో, ఓఎస్డీలకు స్వాగతం

చింతూరు, మార్చి 6 : జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, ఆయుర్వేద వైద్య నిపుణుడు జమాల్ ఖాన్ అందజేసిన రూ. 3 లక్షల 50 వేల ఆర్థిక సహకారంతో జిల్లా పరిషత్ పాఠశాలలో క్రికెట్ ప్రాక్టీస్ నెట్ కోర్టులతో పాటు ఇతర కోర్టులను బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి జమాల్‌ఖాన్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి హాజరై ఆయా కోర్టులను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడా రంగంలో కూడా రాణించాలన్న సదుద్దేశంతో జమాల్ ఖాన్ ఆర్థిక సాయం అందజేయడం హర్షణీయమని అధికారులు అన్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు జమాల్ ఖాన్ మాట్లాడుతూ క్రికెట్ ప్రాక్టీస్ నెట్ కోర్టు ఏర్పాటుతో పాటు మధ్యాహ్న భోజన వంటకాల కోసం రూ .40 వేల విలువ గల వంట పాత్రలు అందజేశామన్నారు. త్వరలో గ్రంథాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ సుధాకర్, ఎంఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌తో హర్షం

చింతూరు, మార్చి 6 : గుంటూరు వేదికపై టీడీపీ, జనసేనలు ఉమ్మడిగా బీసీ డిక్లరేషన్ ప్రకటించడం హర్షనీయమని చింతూరు మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆకోజు నూకాచారి అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల వయసు దాటిన వారికి రూ.4 వేల వంతున పింఛన్ సదుపాయం, జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్ల ఏర్పాటు తదితర కార్యక్రమాలను బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఎ బీసీ రక్షణ చట్టం తీసుకవచ్చే విధంగా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. బీసీ నాయకులు పొదిలి రామారావు, సింహాద్రి, సాయిబాబా, కొండబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

సూరకుంట వాసుల పాదయాత్ర

చింతూరు, మార్చి 6 : తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో చింతూరు మండలం సూరకుంట గ్రామస్థులు పాదయాత్ర చేపట్టారు. 35 కిలోమీటర్ల మేర కాలినడకన బుధవారం చింతూరు ఐటీడీఏకు చేరుకున్నారు. అనంతరం పీవో కావూరి చైతన్యకు వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా తమ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, మరమ్మతులకు గురైన లిఫ్ట్ ఇరిగేషన్ తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఆ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మడివి నెహ్రూ, కుంజా శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, కారం రవి, సోడె ముత్తయ్య, ఈసం సురేష్, ఎంపీటీసీ వేక రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లపై పీవో ఆరా

చింతూరు, మార్చి 6: మిర్చి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య హెచ్చరించారు. చింతూరులో బుధవారం నిర్వహించే వారాంతపు సంతను ఆయన పరిశీలించారు. విలీన మండలాలకు చెందిన మిర్చి రైతులు ఇక్కడకు మిర్చి తరలించి విక్రయిస్తారు. కొంత మంది దళారులు అడ్డుపడి రైతులకు మార్కెట్ ధర అందకుండా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్లు రైతుల నుంచి ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు స్పందించిన ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సంత ప్రదేశానికి వెళ్లి కొనుగోళ్లు, ధరలపై ఆరా తీశారు. పిదప పీవో మాట్లాడుతూ రైతులకు మార్కెట్ ధర చెల్లించి మిర్చి కొనుగోలు చేయాల్సిందిగా సూచించారు. దళారులు అక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీవో హెచ్చరించారు.

రహదారుల పనులకు శంకుస్థాపన

చింతూరు, మార్చి 6 : చింతూరు మండలంలో ఉపాధి నిధులతో చేపట్టనున్న రహదారి పనులకు బుధవారం ఎమ్మెల్యే ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు. కారంగూడెం నుంచి లక్ష్మీపురం కు రెండు కిలోమీటర్ల మేర బీటీ రహదారికి గాను రూ.90 లక్షలు, చూటూరు నుంచి వేగితోట వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రహదారికిగాను రూ.కోటి 95 లక్షలు నిధులు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. వైసీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, ఎంపీపీ అమల , వైస్ ఎంపీపీ సుధాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చౌక దుకాణం సరుకుల పంపిణీలో జాప్యం

మోతుగూడెం, మార్చి6: చింతూరు మండలం మోతుగూడెంలో రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నెట్ సిగ్నల్స్ ఆగిపోవడంతో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదు. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను ఇవ్వకుండా నిలిపివేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

'గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు'

రంపచోడవరం, మార్చి 6: ఏజెన్సీలో నిరుపేద గిరిజనులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలోని జాగరంపల్లి గ్రామానికి చెందిన 16 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల పట్టాలు మంజూచేసిన వారికి రిజిస్ట్రేషన్ కూడా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, కుంజం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సాయిబాబా, వైసీపీ నాయకులు జె.రామన్నదొర, బిశేఖర్, షేక్ ఖాజావల్లి, ఎంపీడీవో హరికృష్ణ, డీటీ బి.రాజు, సీఐ వి.వెంకటేశ్వరరావు, పండా రామకృష్ణదొర పాల్గొన్నారు.

శివరాత్రికి శివాలయాల్లో ఏర్పాట్లు

ఎటపాక, ఫిబ్రవరి 6: మహాశివరాత్రికి శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ప్రధానంగా గన్నవరం గ్రామంలోని శ్రీకాశీకార్తీశివాలయం, గొల్లగూడెంలోని వందేళ్ల కాలం నాటి శివాలయం, బుట్టాయిగూడెం, కన్నాయిగూడెం, నందిగామ, బండిరేవులోని శివాలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయంలో..

వై.రామవరం,మార్చి6: అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పూతిగుంట ఉబ్బలింగేశ్వరస్వామి శైవక్షేత్రం శివరాత్రి మహోత్సవాలకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ ప్రకృతి సిద్ధంగా వెలిసిన జలపాతాలను వీక్షించేందుకు, శివాలయాన్ని దర్శించేందుకు భక్తులు తరలివస్తారు. ఈ ఆలయంలో మూడు నుంచి ఐదు రోజులు వరకు తీర్థ మహోత్సవాలు కోలాహలంగా జరుగుతాయి. పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మండలంలోని చవిటిదిబ్బలు నుంచి మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ ఆలయానికి ఏలేశ్వరం, గోకవరం రూట్ల నుంచి వచ్చే భక్తులు అడ్డతీగల మీదుగా నేరుగా వై.రామవరం వైపు 20 కిలోమీటర్లు ప్రయాణించి చవిటిదిబ్బలలో దిగి అక్కడి నుంచి పూతిగుంట వెళ్లాల్సి ఉంది.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎటపాక, ఫిబ్రవరి 6: ఎటపాక మండలం, గన్నేరుకొయ్యపాడు గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నట్లు వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో తాగునీరు సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైంది. వేసవికాలం ప్రారంభం కావడంతో వెంటనే స్పందించిన వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కొత్తమోటారు అమర్చి, నీటి సమస్య లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామంలో యథావిధిగా మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.



మోటార్ పనులు పరిశీలన

టీడీపీ బీసీ డిక్లరేషన్‌తో వైసీపీ వెన్నులో వణుకు

- 10న రాజమహేంద్రవరంలో ఎన్నికల శంఖారావం సభ
- టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: తమ నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు బీసీ డిక్లరేషన్ ప్రకటించిననాటి నుంచి వైసీపీ వెన్నులో వణుకు మొదలైందని ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉందన్నారు. పార్టీకి ఎల్లప్పుడు అండదండగా ఉన్న బీసీ ల రుణం తీర్చుకునేందుకే బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు ప్రకటించారని చెప్పారు. దీంతో బీసీ దిశ దశ మారబోతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌పై ఇష్టాను సారం మాట్లాడుతున్న మంత్రి వేణు ఏనాడో జాతి ఆత్మగౌరవాన్ని పెద్దరెడ్ల కాళ్లదగ్గర తాకట్టు పెట్టాడని విమర్శించారు. ఇక సోదరుడు ఎంపీ భరత్ రామ్‌కు దమ్ము వుంటే బీసీ డిక్లరేషన్ చూసి సిగ్గు తెచ్చుకుని జగన్ వద్దకు వెళ్లి ఇంతకంటే ఘనంగా బీసీలకు ఏదైనా చేస్తాడెమో అడిగి సాధించుకో వాలని సూచించారు. అంతే తప్ప సినిమాలో డైలాగ్‌లు చెప్పవద్దన్నారు. ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. బీసీలలో ఉన్న 157 కులాలకు న్యాయం చేసే బాధ్యత టీడీపీ -జనసేన తీసుకుంటాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో ఈనెల 10న ఎన్నికల శంఖారావం సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బుడ్డిగ రాధా, నక్కా దేవి వరప్రసాద్, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, బుడ్డిగ రవి, పితాని పైడిరాజు, ధర్మ, మాజీ కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, బాబీ పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టండి'

అనపర్తి, మార్చి 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు



అనపర్తి: మహాశక్తి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జోన్ - 2 కోఆర్డినేటర్ రంగారావు, నల్లమిల్లి

ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జోన్ 2 కోఆర్డినేటర్ రావు వెంకటసుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బిక్కవోలులో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశక్తి పథ కాల ప్రచార కార్యక్రమంలో ఆయన టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్ల మిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జగన్‌రెడ్డి మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధి లేకున్నా అరాచకాలకు కొదవలేదన్నారు. అనపర్తి నియోజకవర్గంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 90శాతం మహాశక్తి పథకాల ప్రచారం పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, చిట్టిబాబు చౌదరి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, మల్లేశ్వరి, బేరా వేణమ్మ, చిన్నమ్మ, పోతంశెట్టి సుబాషిణి పాల్గొన్నారు.

టీడీపీ విజయం కోసం కృషి చేయాలి : నల్లమిల్లి

రంగంపేట : అనపర్తి నియోజక వర్గంలో టీడీపీ, జనసేనల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని టీడీపీ, జనసేన పార్టీల సమన్వయంతో శ్రమించి నా విజయం కోసం కృషిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు, రాష్ట్రంలో ఉన్న 175 నియోజక వర్గాలలో ఎక్కడా లేని విధంగా అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన రెండు పార్టీలు సమన్వయ లోపం లేకుండా విజయం సాధించామంటే ఆదిమర్రెడ్డి శ్రీనివాస్ ఘనత అని అన్నారు.

బీసీల హత్యలు జరగలేదు..

- ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బీసీలపై హత్యల విషయంలో సాధారణ మరణాలనూ ఆ జాబితాలో కలిపేస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ అన్నారు. జయహో బీసీ భారీ బహిరంగ సభలో టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌పై ఎంపీ భరత్‌రామ్, మంత్రి వేణు వేర్వేరుగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి విమర్శలు గుప్పించారు. ఎప్పటి మాదిరిగానే ఏకంగా చంద్రబాబుతో చర్చకు సిద్ధమంటూ సవాల్ విసిరేశారు. జగన్ బటన్‌నొక్కి రూ.1.70వేల కోట్లు బీసీల ఖాతాల్లో వేశారన్నారు. చేయూత గురించి మాట్లాడుతూ పథకం పేరు ఏదైనా డబ్బులు వచ్చాయా లేదా అనేదే ప్రశ్న అన్నారు. బీసీలకు 50ఏళ్లకే పింఛను మంజూరు చేస్తామని బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు చెప్పారని.. వైసీపీలో అలాంటి ప్రతిపాదన ఉంటుందా అని ప్రశ్నించగా సమాధానం కరువైంది. మంత్రి వేణు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై పలు ఆరోపణలు చేశారు. బీసీ డిక్లరేషన్ అనేది కాపీ పేస్టు ప్రోగ్రామన్నారు. 2014లో 142 హామీలతో బీసీలకు చంద్రబాబు హామీలిచ్చారన్నారు. ఒక్క హామీ కూడా అమలు చేయ లేదని విమర్శించారు. కులగణనపై జగన్ త్వరలో ప్రకటన చేస్తారని మంత్రి చెప్పారు.

ఎంపీ భరత్.. నోరు అదుపులో పెట్టుకో

- టీడీపీ బీసీ నేతల హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: ఎంపీ భరత్ రామ్ నోరు అదుపులో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని టీడీపీ రాజమహేంద్రవరం కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, నగర టీడీసీ బీసీసెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి హెచ్చరించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నీ తండ్రి మార్గాని నాగేశ్వరరావుకు బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ పదవి రావడానికి అనాడు నిర్వహించిన బీసీ గర్జన సభే కారణమని ఆ సభ విజయవంతానికి ఆనాడు ఆదిరెడ్డి అప్పారావు కీలకంగా వ్యవహరిం చారన్నారు. బుడ్డిగ రవి మాట్లాడుతూ సిద్ధం సభలో పేర్ని నాని, కొడాలి నానిలను చూసి నీ ఇష్టం వచ్చినట్టుగా నీతండ్రి సమానుడైన ఆదిరెడ్డి అప్పారావుకు చెప్పు చూపించావు. ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ భరత్ రామ్ నువ్వు మబ్బుల్లో ఉన్నావు బయటకు వచ్చి వాస్తవ పరిస్థితులు చూసుకో అని సలహా ఇచ్చారు. సమావేశంలో టీడీపీ మిస్కా జోగినాయుడు, కడలి రామకృష్ణ, బాబి, ఉల్లూరి శ్రీను, సప్పా వెంకట రమణ, గోవింద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపులకు అన్యాయం జరుగుతోంది

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడి శ్రీను

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: రాష్ట్రంలో 46 లక్షల జనాభా గల తూర్పుకాపులకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని తూర్పుకాపు ఐక్యత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తూర్పుకాపులకు న్యాయం జరగాలంటే చట్ట సభల్లో ప్రాధాన్యత పెంచాలన్నారు. ఓబీసీ కులధ్రువీకరణలో ఎదురవుతున్న సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం తమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సుంకర అన్నపూర్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా తురిమిసతీష్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా దేవర సత్యవాణి, సంఘం ఉపాధ్యక్షుడిగా జోనుపల్లి జగ్గారావు, నగర కార్యదర్శిగా మజ్జి దాలసియ్యలను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

టీడీపీ బీసీ డిక్లరేషన్‌పై హర్షం

ధవళేశ్వరం, మార్చి6: టీడీపీ బీసీ డిక్లరేషన్ ప్రకటనపై స్థానిక బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బీసీలంతా టీడీపీ వెంటే ఉన్నారన్నారు. బుధవారం స్థానిక బీసీ సంఘం నాయకులు బత్తిన బ్రదర్స్, పల్లా రామస్వామి, నీటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, వందూరి అప్పారావు, సీనియర్ నాయకులు ఆళ్ళ ఆనందరావు, పుక్కెళ్లరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్, రాజకీయ రిజర్వేషన్‌లు 34శాతానికి పెంపు, బీసీలకు రక్షణ చట్టం వంటివి ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కరణం రామారావు, గండిబోయిన నాగరాజు, దొడ్డి బాబ్జి, ఆళ్ళవితల్, కొత్తూరి దుర్గారావు, దాసరి సాగర్, జ్యోతుల సత్యనారాయణ, బి.రాజేష్ పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 : రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్- 1 ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా బుధవారం మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది పద్మావతి, కళాశాల సెక్రటరీ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: రాజమహేంద్రవరంలో మహాశివ రాత్రి ఏర్పాట్లపై కమిషనర్ దినేష్ కుమార్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చాలా ఎక్కువ మంది భక్తులు వస్తారని అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేయాలన్నారు.శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి అధికారులు విధుల్లో నిమగ్నమై ఉండాలన్నారు. కోటిలింగాల క్షేత్రం రథయాత్ర సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమణ, ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

రాజమహేంద్రవరంకల్చరల్, మార్చి6: మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని)లో శ్రీ మహాశివరాత్రి మహోత్సవం శుక్రవారం నుంచి 10వ తేదీ ఆదివారం వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. భక్తులు గమనించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మహా శివరాత్రి జాగరణకు తరలిరండి

రాజానగరం, మార్చి 6 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 8న నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో తలపెట్టిన మహా శివరాత్రి జాగరణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని రాజానగరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు కోరారు. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ ఏర్పాట్లను వెల్లడించారు. అయ్యప్ప, భవాని, శివ భక్తులు సంయుక్తం ఆధ్వర్యంలో జాగరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8న సాయంత్ర 4గంటలకు రాజానగరం శివపార్వతుల ఉత్సవమూర్తులను బసవేశ్వర ముత్యాల వాహనంపై కోలాట నృత్య ప్రదర్శనలతో భారీ ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు చేరుకుంటారన్నారు. రాత్రి 6-8 గంటల మధ్య స్వామివారికి 108 కిలోల ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కళ్యాణ క్రతువును కన్నుల పండువగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు తీగల రాజు, కార్యదర్శి పి.అను కుమార్, సహాయకార్యదర్శి కె.జాన్, డైరెక్టర్ గ్రంధి రాజా, కంకటాల సత్యనారాయణమూర్తి, యోగా గురువు రమణ, మోది సత్తిబాబు పాల్గొన్నారు.

కడియపులంకలో జైశ్రీరామ్ ర్యాలీ

కడియం, మార్చి 6: కడియపులంకలో బుధవారం హనుమాన్ మాలధారణ భక్తులు, నర్సరీ రైతులు, పూలవ్యాపారులు, గ్రామస్తులు జైశ్రీరామ్ అంటూ భక్తులు ర్యాలీ నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా కడియపులంక ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ప్రతీఏటా వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో బాగంగా వేలాది మంది భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సప్తనదీ జలాలతో గ్రామ సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కడియం, మార్చి 6: మహా శివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా భక్తితో నిర్వహించుకోవాలని రాజమహేంద్రవరం దక్షిణ మండల డీఎస్పీ ఎం. అంబికా ప్రసాద్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు వంటి వాటికి తావివ్వద్దు అన్నారు. ఆలయాలవద్ద ప్రసాదాలు వితరణ సమయంలో అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి భద్రత ఏర్పాట్లు కోసం తగిన వలంటీర్లు, ప్రైవేటు సెక్యూరిటీగార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం

కోరుకొండ, మార్చి6: కోరుకొండ శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద బుధవారం రాత్రి స్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు ఇతర పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని రెంటాల రమణమూర్తి, రెంటాల వెంకట్రావు, కుటుంబసభ్యులు ఇతర భక్తులచే కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ధన దుర్గమ్మ జాతర మహోత్సవం

సీతానగరం, మార్చి 6: మండలంలోని వెలమపేటలో ఉన్న శ్రీశ్రీశ్రీ ధన దుర్గమ్మ 15వ జాతర మహోత్సవాలను సీతానగరం గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు అమ్మవారికి పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి కలశాలను నెత్తిన పెట్టుకుని మహిళలు పురవీధులలో ఊరేగించి ఆలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అయోధ్యకు ఇద్దరు యువకుల బైక్ యాత్ర

రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు రాజమహేంద్రవరం నుంచి బైక్‌లపై అయోధ్యకు బయలుదేరారు. తాడేపల్లిగూడెంకు చెందిన ప్రణీత్, కాకినాడకు చెందిన తేజ్‌తరుణ్ బైక్ యాత్రను పుష్కరఘాట్ నుంచి జైశ్రీరామ్ నినాదాల నడుమ ఎంపీ భరత్‌రామ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రణీత్, తరుణ్ మాట్లాడుతూ మూడు రోజుల్లో అయోధ్య చేరుకుని బాలరాముడి దర్శనం చేసుకుంటామన్నారు. యూట్యూబ్ ద్వారా తమ యాత్రా విశేషాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పారు.

బొల్లేద్దుపాలెం సారా బట్టీలపై పోలీసుల దాడి

- 200 లీటర్ల సారా స్వాధీనం

కోరుకొండ, మార్చి6: కోరుకొండ ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్‌కు తన సిబ్బందితో బుధవారం బొల్లేద్దుపాలెంలో సారా బట్టీలపై దాడులు చేశారు. గ్రామ శివారు కర్రి సాయి మొక్కజొన్న తోటవద్ద సాయి, వెంకన్న ఇరువురు కలిసి వారి పొలం గట్టుపై సారా బట్టీ నిర్వహిస్తున్నారని ఎస్ఐ తెలిపారు. సిబ్బందితో కలిసిదాడి చేసి సారా బట్టీ ధ్వంసం చేశారు. సారా కాసే ఇరువురు పరారయ్యారని, అక్కడ 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజానగరం, మార్చి 6 : తల్లి మందలించిందనే నెపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు కాకినాడ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని పల్లకడియం గ్రామానికి చెందిన రొక్కాల వీరబాబు(20)అనే వివాహితుడు జులాయిగా తిరుగుతూ మాటిమాటికి డబ్బుల కోసం తల్లిని వేధించడం పరిపాటిగా చేసుకున్నాడు. ఈనేప థ్యంలో పనీపాటా లేకుండా ప్రతిరోజు డబ్బులు అడిగితే ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తానంటూ తల్లి సున్నితంగా మందలించడంతో మనస్తాపానికి గురైన వీరబాబు. జనవరి 30న గడ్డిమందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీ కులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో 35 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరబాబు బుధవారం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. ఈమేరకు రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాద్ పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

'ఏరోబిక్స్‌తో ఆరోగ్యం, మానసికోల్లాసం'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: చారిత్మతక ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరోబిక్స్‌తో ఆరోగ్యం మానసికోల్లాసం కలుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామచంద్రరావు అన్నారు.ఆర్ట్సకళాశాల గ్రౌండ్‌లో బుధవారం ఉదయం 6గంటలకు ఏఎస్పీ పి.గోపాలకృష్ణ, కంటే వీరన్నచౌదరి, ప్రిన్సిపల్ రామచంద్రరావు ఏరోబిక్స్‌ను ప్రారంభించారు. తొలుత పూర్వ విద్యార్థుల సంఘం టీ షర్టును ఆవిష్కరించారు. అనంతరం ఏరోబిక్ గురువులు విజయ్, వీవీ.లక్ష్మి యువకులు, పెద్దలు, పిల్లలతో ఏరో బిక్స్ చేయించారు.ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ళ మాధవ్ ,ఉపాధ్యక్షుడు భార్గవ్, కార్యదర్శి గద్దే సుధాకర్, కోశాధికారి విజయలక్ష్మి, అలికాన సత్యశివ కుమార్, సభ్యులు కేశంశెట్టి వరప్రసాద్, ఫణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్లపై ప్రాంతీయ కో ఆర్డినేటర్ సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 : ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ ఉప సంచాలకులు కృష్ణారావు బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇగ్నో అడ్మిషన్లపై సమీక్ష జరిపారు. అనంతరం స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల, కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలను ఆయన సందర్శించి వివిధ వర్గాల విద్యార్థులకు ఇగ్నో అందిస్తున్న సర్టిఫికెట్, డిప్లమో కోర్సులపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత కోర్టు కాంప్లెక్స్‌లోని రాజమండ్రి బార్ అసోసియేషన్‌ను సందర్శించి న్యాయవాదులకు ఇగ్నో అందిస్తున్న కోర్సులను వివరించారు. ఇగ్నోప్రవేశాలకు మార్చి10తో గడువు ముగుస్తుందన్నారు.

క్రీడలతోనే గుర్తింపు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 : క్రీడల్లో జట్టు విజయం కోసం ఎంత కష్టపడతామో, ఓడిపోయినప్పుడు కూడా మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందడం క్రీడల్లోనే సాధ్యమని సంఘ సేవకులు సీతనబోయిన సాయిరాం అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ మెన్, సెలెక్షన్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, తోట సుబ్బారావు, సుంకర నాగేంద్ర కిషోర్, నన్నయ విశ్వవిద్యాలయం పీడీ బి.రామ్‌గోపాల్, పీఏ కిషోర్‌బాబు, పీవీబీ సంజీవ రావు, డీవీ రమణమూర్తి, బీవీఎన్ మూర్తి, 12 జట్లు క్రీడాకారులు పాల్గొన్నారు.

'మూడో పంటగా అపరాలు సాగు చేయవచ్చు'

దివాన్‌చెరువు, మార్చి 6: జిల్లాలోనే అందరికంటే ముందుగా చాగల్నాడు ఆయకట్టు ప్రాంత రైతులు దాళ్వా వరి కోతలు చేపడుతున్నారని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మూడవ పంటగా స్వల్పకాలిక అపరాల పంటలను సాగుచేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాను రాజానగరం, రంగంపేట మండలాల్లోని కొన్నిగ్రామాలను సందర్శించి మూడో పంటగా అపరాలసాగుకు తగిన సూచనలు చేశానన్నారు.

10న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

గోకవరం, మార్చి 6: గోకవరం మండలం వీరలింకపల్లిలోగల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశంకోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంజులవేణి రాణి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశంకోసం ఈనెల 10న పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 4.30వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. వివరాలకోసం 9398622778, 9441102187కు సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు.

జనపనార తయారీ ఉత్పత్తులపై ముగిసిన శిక్షణ

రాజానగరం, మార్చి 6 : మండలంలో కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జనపనార తయారీ ఉత్పత్తుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై ఆత్మ తూర్పుగోదావరిజిల్లా సౌజన్యంతో గ్రామీణ యువతకు వారం రోజులపాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానికి రాజానగరం, రాజమహేంద్రవరం, నరేంద్రపురం, కలవచర్ల, శ్రీకృష్ణపట్నం, కోరుకొండ, గాదరాడకు చెందిన 15 మంది మహిళలను ఎంపికచేశామన్నారు.

ఎన్నికల నియమావళికి సిద్ధంగా ఉండాలి

కడియం, మార్చి 6: త్వరలో ఎన్నికల కోడ్ వెలువడనున్నందున ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళిని ప్రతీఒక్కరూ పాటించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలో పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల కోడ్ సంబంధించి వివరాలను తెలిపారు. కోడ్ ఏరోజు వెలువడినా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: నన్నయ వీసీ


దివాన్‌చెరువు, మార్చి 6: ప్రస్తుతం చేపడుతున్న అన్ని పనులను వేగ వంతంగా పూర్తిచేసి అనుకున్న సమయానికి భవనాలు అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కాంట్రాక్టర్లను కోరారు. రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంగణాలలో రూ.37.78 కోట్లతో అభివృద్ధి పనులకు బుధవారం పూజా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో నిలిచిపోయిన భవననిర్మాణపనులను ప్రారంభించడానికి పూజలు చేశామన్నారు.

జంబుపట్నంలో బల్క్‌మిల్క్ యూనిట్ ప్రారంభం

కోరుకొండ, మార్చి6: మండలంలోని పాత జంబుపట్నం గ్రామంలో బీఎంసీయూ బల్క్ మిల్క్ కేంద్ర యూనిట్ ఏఎంసీయూ యూనిట్లను బుధవారం జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ వుల్లి బుజ్జిబాబు, సర్పంచ్ వుల్లి అప్పన్నదొరలు ప్రారంభించారు. మండలంలోని 16 గ్రామాల నుంచి ఈ బల్క్‌మిల్క్‌కేంద్రానికి పాలుసరఫరా చేస్తారు. ఒక్క రోజుకు 5వేల లీటర్ల పాలు ప్రాసెసింగ్ చేస్తారని, మిషనరీనిఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 7 మార్చి 2024 | 5



అపవిత్రం : కొవ్వూరు కనకదుర్గ రేవు వద్ద దుర్గంధం ఇలా...

కలిసిన గోరంట్ల- దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో టీడీపీ. జనసేన అధినేతలు తీసుకున్న నిర్ణయాల విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ఒక మాట మీదకు వచ్చారు. తొలి జాబితా ప్రకటించిన నాటి నుంచి ఈ సీటు విషయంలో ఇద్దరు నేతలు కాస్త ఎడమొఖం, పెడ ముఖంగా ఉన్న సంగతి తెలిసిందే. జనసేన అధి నేత దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయాలని చెప్ప డంతో ఆయన నిడదవోలు నుంచి.. గోరంట్ల రూరల్ నుంచి పోటీ చేయడం ఖాయమైంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పలువురు నాయకులతో కలిసి దుర్గేష్ ఆఫీసుకువెళ్లి ఆయనతో ఆత్మీయంగా సమావేశం అయ్యారు.ఇద్దరు పలు విషయాలను స్పష్టంగా మాట్లాడుకున్నట్టు సమాచారం. చివరకు ఇద్దరూ ఒకమాట మీద కు వచ్చినట్టు సమాచారం. దీంతో రూరల్ సీటు విషయంలో నెలకొన్న అనిశ్చితి తొలగినట్టు అయింది. నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శేషారావుకు నచ్చచెప్పే బాధ్యత టీడీపీ అధిష్ఠానం తీసుకుంది.కొద్దిరోజుల్లో ఆయనతో అధిష్ఠానం మాట్లాడనుంది.ఇక రూరల్,నిడదవోలు స్థానాలకు గోరంట్ల,దుర్గేష్ పేర్ల టీడీపీ,జనసేన అధిష్టానాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నాయి.ఆ వెంటనే దుర్గేష్ నిడదవోలులో అధికారికంగా ప్రచారం ప్రారంభిస్తారు.

425 మంది టీచర్లకు రెండు నెలలుగా జీతాల్లేవ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలతో పాటు ఎయిడెడ్, గవర్నమెంట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి గత రెండు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ) గా ఉన్న రాజమహేంద్రవరం ఏలూరు ,కాకినాడ ప్రాంతాల్లో డీఐల నుంచి ఎంఈవోలకు ఉద్యోగాల జాబితా బదలాయింపులు జరిగాయి. అయితే ఇందులో ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేసే సెంట్రలైజ్ ఫైనాన్స్ మేనేజిమెంట్ సిస్టమ్‌లో రాజమహేంద్రవరానికి సంబంధించిన 425 మంది ఉపాధ్యాయులు పేర్లు కనిపించకుండాపోయాయి. దీంతో ఇబ్బందులు తలెత్తాయి. గత రెండు నెలలుగా ఈ సమస్యకు కొలిక్కిరాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు వెంటనే విడుదల చేయాలని బుధవారం రాజమహేంద్రవరంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, రాష్ట్ర మాజీ కార్యదర్శి వంరుల అప్పయ్యశాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్‌లు డీఈవో వాసుదేవరావును కలిసి వినతిపత్రం అందించారు.దీనిపై స్పందించిన డీఈవో రెండు ,మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

20 నుంచి నరసన్న ఉత్సవాలు

కోరుకొండ, మార్చి6: చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారి రథశాల నుంచి అతి పెద్ద రథాన్ని పండితులు నిర్ణయించిన సుమూహూర్తానికి బయటకు తీశారు. ముందుగా ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు స్వామి వారి రథానికి పూజలు చేశారు. అనంతరం రంగరాజభట్టర్ కొబ్బరికాయ కొట్టగా గ్రామస్తులు రథాన్ని రథశాల నుంచి బయటకుతీశారు.ఈ రథానికి మరమ్మతులు, అలంకరణ, రంగులు అద్దడం, వంటి పనులు చేసి 15 రోజులు తరువాత జరిగే రథోత్సవానికి సిద్ధం చేస్తారని రంగరాజభట్టర్ తెలిపారు.



భూపాలపట్నంలో పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ, ఆర్డీవో

జిల్లాలో 170 పాలసేకరణ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ మాధవీలత

దివాన్‌చెరువు, మార్చి6 : జిల్లాలో 170 పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజానగరం మండలం భూపాలపట్నంలో బీఎంసీయూను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతుకి వ్యవసాయంతో బాటు పాడి ఉంటే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాన్నారు.ఈ మేరకు అమూల్ కేంద్రాల ద్వారా మద్దతు ధరకి పాలని సేకరించడం జరుగుతోందని చెప్పారు. సంపత్‌నగరం గ్రామంలో ఎమ్మెల్యే రాజా, జేసీ తేజ్‌భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి పాలసేకరణ కేంద్రం ప్రారంభించారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రాధాకృష్ణ, డి.డి. డాక్టర్ ఎం.వెంకటేశ్వ రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న సర్పంచ్ హిమబిందు అత్తమామలు

శివ..శివా..

- రేపు శివరాత్రి స్నానమెలా శివయ్యా..
- అధ్వానంగా రేవులు.. నాచుతో గోదారి నీళ్లు
- బుధవారం హడావుడిగా ఏర్పాట్లు



గోదారంతా ఇంతే : రాజమహేంద్రవంలో ఘాట్ల వద్ద అధ్వానం.. రంగుమారిన నీళ్లు



ఈ నీళ్లతో పుణ్యస్నానమా : రాజమహేంద్రవరంలో రంగుమారిన గోదావరి నీళ్లు



పట్టిసం : కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో మెట్లపై ఇసుక మేట



పట్టిసంతేనా : కొవ్వూరు గోష్పాదక్షేత్రం ర్యాంపులో మెట్లపై వదిలేసిన దుస్తులు


రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, మార్చి 6 : గోదావరి రేవులు చూస్తే ఎవరైనా శివ శివా అనక మానరు.. ఎందు కంటే అంత అధ్వానంగా ఉన్నాయి. గతంలో శివరాత్రి వచ్చిం దంటే గోదావరి రేవులన్నీ ఈ పాటికే శుభ్రం చేసి సిద్ధం చేసే వారు.. మరి నేడు ఎక్కడికక్కడ రేవులు అధ్వానంగా దర్శనమి స్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు శివరాత్రి సంద ర్భంగా పుణ్యస్నానాలు రాజమహేంద్రవరంలో కానీ కొవ్వూ రులో చేయడం ఆనవాయితీ.. అయితే ఈ ఏడాది మాత్రం రేవులు చూస్తే భయపడక మానరు. ఎందుకంటే నేటికీ అంత అధ్వానంగా ఉన్నాయి. గోదావరిలో స్నానం చేస్తే పుణ్యం మాట అటుంచి రోగాలు వెంట వచ్చేలా ఉంది పరిస్థితి. శుక్రవారం మహాశివ రాత్రి సందర్భంగా భక్తజనం పెద్దఎత్తున్న రాజమహేంద్రవరం గోదావరి రేవులకు పుణ్యస్నానాలకు తరలివస్తారు. అయితే ఈ ఏడాది ఏర్పాట్లను అధికార యంత్రాంగం హడావుడిగా చేస్తుంది. రాజమహేంద్రవరంలో మహాశివరాత్రి పేరుచెబితే ప్రధానంగా పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులకు అధికంగా భక్తుల తాకిడి ఉంటుంది. కోటిలింగాల క్షేత్రం దక్షిణకాశీగా ప్రఖ్యాతి..ఈ మేరకు వేలాది మంది భక్తులు గోదావరిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు చేసి ఉమాకోటిలింగేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఈ ఏడాది కోటిలింగాల రేవులో గోదావరి నీరు గతేడాది కంటే వెనక్కి ఉంది. నీరు కూడా బురదతో నిండి స్నానాలకు అను కూలంగా లేకపోవడంతో ఇప్పుడు ఆ రేవులో ఒడ్డున ఇసుకతో నింపుతున్నారు. అదే రేవులో ఉన్న జల్లు షవర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాటిలో పనిచేసేవాటిని తాత్కాల్కింగా సిద్ధం చేస్తున్నారు. చింతాలమ్మ ఘాట్, దుర్గమ్మఘాట్లలో బంకమట్టి దిబ్బలు వేసి పిచ్చి మొక్కలతో నిండి స్నా నం చేసేందుకు అనువుగా లేదు. పుష్కరాలరేవులో నీరు నాచు పట్టిపోయింది. మార్కండేయ ఘాట్‌లోను ఇసుక వేశా రు. గౌతమి ఘాట్ అధ్వానంగా ఉంది. బోర్డులు పెట్టారు అక్కడ నీళ్ళు లేవు. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో శుభ్రత లేదు. చాలా చోట్ల నీటిపై నాచు పేరుకుపోయింది. వాటిని శుభ్రం చేయాల్సి ఉంది. లేదంటే పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు జారిపడి ప్రమాదాల బారిన పడతారు. అపరకర్మలు నిర్వహించిన భక్తులు గోదావరి నదిలో పున్యస్నానాలు ఆచరించి బట్టలను అక్కడే వదిలివేయడంతో స్నానఘట్టాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. కనకదుర్గమ్మ ఆలయం ఎదుట గోదావరి నదిలో పూజాద్రవ్యాలు, వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అయితే అధికారులు మాత్రం ఏర్పాట్లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. శివరాత్రికి ఒకే రోజు ముందు బుధవారం పనులు ఆఘమేఘాలపై చేయిస్తున్నారు. దీంతో భక్తులకు అసౌకర్యం తప్పదు మరి.



వంగలపూడి వయా పట్టిసీమ

సీతానగరం,మార్చి 6 : మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం వీరేశ్వరుడిని దర్శించుకునేందుకు వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు వంగలపూడి మీదుగా ఇసుకలో నడచుకుంటూ గుడికి వెళతారు.ఈ మేరకు గోదావరి నదికి అడ్డుకట్టవేసి ఇసుకతో రోడ్డు వేసి మార్గం సుగమం చేశారు. భక్తులకు మంచినీటి వసతితో పాటు ,ఉచిత భోజన సదుపాయాలు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ కొంచ అన్నపూర్ణ ,కొంచ చంద్రభాస్కరరావు తెలిపారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

చైర్మన్ గిరీకో.. దండం



అలంకారంగా కార్పొరేషన్ చైర్మన్ పదవులు

రాజమహేంద్రవరానికి చెందిన సంకిస భవానీప్రియకు రాష్ట్ర గాండ్లతెలకులు,దేవతిలకుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. రాష్ట్రంలో ఈ సామాజికవర్గం ప్రజలు సుమారు 10 లక్షల మంది ఉంటారనేది అంచనా. కానీ వీరికి ఒరిగిందేమీ లేదు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన చైర్మన్ అయినప్పటికీ ఈ ప్రాంతానికి కూడా చిన్న మేలు చేయ లేని పరిస్థితి. చాలా మందికి తమకో చైర్మన్ ఉన్నారనే విషయం కూడా తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలకుల సామాజికవర్గం వారు కరెంట్‌తో గానుగులు తిప్పుకోవడానికి 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశారు. పనిచేయలేని స్థితిలో ఉన్నవారికి పింఛన్లు ఇవ్వాలని కోరారు. కానీ ఇంత వరకూ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కార్పొరేషన్‌కు చైర్మన్ పదవితో పాటు 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. అయితే ఏం లాభం చైర్మన్‌గా ఉన్నావారి కులానికి సంబంధించి ఒక్కపనీ చేసుకోలేని దుస్థితి. మిగిలిన కార్పొరేషన్లదీ ఇదే పరిస్థిది.. చైర్మన్ పదవులన్నీ అలంకార ప్రాయంగానే మిగిలాయి.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బీసీలకు వైసీపీ ఏం చేసింది.. కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది అంతే.. ఆ కార్పొరేషన్లతో ఏం చేశారంటే ఏమీ లేదు.. ఆయా కార్పొరేషన్లకు చిల్లిగవ్వ కూడా విదల్చ లేదు. 56 బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను కేటాయించ డంతో ఆరంభంలో ఆహా జగన్.. ఓహో జగన్ అన్నారు. నేడు వారంతా ఎక్కడ ఉన్నారో కానరాని పరిస్థితి. ఎందుకంటే వారికి నిధులు లేవు.. విధులు లేవు.. కనీసం కుర్చీ కూడా లేదు. పేరుకే కార్పొరేషన్.. పేరుకే చైర్మన్.. కులాల వారీ ప్రజలను ఉద్ధరిస్తానని చెప్పి బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ప్రకటించిన వైసీపీలో వారికి కనీస గౌరవం దక్కలేదు. బీసీలకు నామమాత్రపు పదవులు కట్టబెట్టి ఊరేగుతోంది. కొంతమందికి పదవులైతే వచ్చాయి. కానీ వాళ్ల చేతిమీద వారి సామాజిక వర్గానికి చిన్న మేలు కూడా చేయలేని దుస్థితి. గత తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేసింది. పైకి బీసీల మీద కపట ప్రేమను చూపిస్తోంది.

- వైసీపీ ఉత్తుత్తి కార్పొరేషన్లు
- పనికి రాని చైర్మన్ పదవులు
- చైర్మన్లకు కుర్చీలు లేవు.. గౌరవం లేదు
- బీసీలకు 56 కార్పొరేషన్లు
- ఒక్క రూపాయి విధల్చని జగన్
- జిల్లాకు రెండు చైర్మన్ పదవులు
- ఇతర కార్పొరేషన్లదీ ఇదే పరిస్థితి

56 బీసీ కార్పొరేషన్లు..

బీసీలలో 130కు పైగా కులాలు ఉన్నప్పటికీ, వాటిలో 56 కులాలకు నామమాత్రంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లు పదవులు ఇచ్చారు. కానీ వీరు కూర్చోవడానికి కుర్చీలు లేవు. గొల్లపూడిలో నామ మాత్రం 56 కార్పొరేషన్లకు ఓ భవనం చూపించి అవే మీ కార్యాలయాలు అని చెప్పడంతోనే సరిపోయింది. జిల్లాలో రెండు బీసీ వర్గాలకు కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఇచ్చారు. జనవరి నాటికే ఏడాది పూర్తయింది. కనీసం ఒక్క పథకం కూడా అమలు కాలేదు. వారికి మళ్లీ పదవీకాలం పొడిగించారంతే. కనీసం ఎన్నికల ముందు వీరికి నిధులివ్వలేదు. నిధులు రాక.. విధులు లేక ఇతర కులాల కార్పొరేషన్లకు చెందిన కొందరు విసుగుచెంది పదవులకు రాజీనామా చేశారు. కార్పొరేషన్ చైర్మన్లకు ఆరంభంలో ఒకటి రెండు సార్లు మూడు నెలలకొకసారి గౌరవ వేతనం ఇచ్చారు. తర్వాత అదీ లేదు.ఎందుకీ పదవులనే బాధ వారిలో గూడు గట్టుకుంది..చైర్మన్ పదవి ఉన్నవారు ఏదో గౌరవం ఉందని తిరుగుతున్నారు.సొంతడబ్బులు పెట్టుకుని తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.ఈ పదవులతో ఎవరికీ మేలు చేసేఅవకాశం లేకపోవడంతో అలంకారంగా మిగిలాయి.

ఇదీ కార్పొరేషన్ చైర్మన్ల దుస్థితి...

జిల్లాలో గోపాలపురం ప్రాంతానికి చెందిన ఇళ్ల భాస్కరరావును అతిరాస కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.రాష్ట్రంలో ఈ వర్గం జనాభా కేవలం వేలల్లో ఉంటుంది. వీరంతా పేదలే..ఈ కార్పొరేషన్ వల్ల వీరికి మేలు జరుగుతుందని అందరూ భావించారు. కానీ ఒక పథకం అమలు చేయలేదు. ఒక్క రుణం ఇవ్వలేదు.దీంతో సదరు చైర్మన్ ఏదో చైర్మన్‌గా ప్రచారం చేసుకోవడం తప్ప అతని వల్ల ఈ సామాజిక వర్గానికి ఒరిగిందేమీ లేదు. చాగల్లుకు చెందిన సినీ నిర్మాణ కొఠారుఅశోక్‌బాబు కొంత కాలం కిందట కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఏదో చేయవచ్చని ఆయన మొదట ఆనంద పడ్డారు.వాస్తవం తెలిసిందే. దీని ద్వారా ఏమీ చేయలేమని అర్థం చేసుకుని కొద్ది నెలల కిందట ఈ పదవికి రాజీనామా చేసి, హైదరాబాద్‌కు వెళ్లిపో యారు. బురిడి పద్మావతి తూర్పుకాపు కార్పొ రేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమె కూడా ఏమీ చేయలేని పరిస్థితి. పిల్లి నిర్మల,కానుబోయిన సాగర్, మార్తి లక్ష్మి వంటి వారికి వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు వచ్చాయి. కానీ అవన్నీ అలంకార ప్రాయంగానే మిగిలి పోయాయి.ఇవే కాదు. ఇతర కులాల కార్పొరేషన్లు పరిస్థితి అంతే ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు అసలు పనే లేదు.

నిధుల్లేని బ్యూటిఫికేషన్ కార్పొరేషన్

వైసీపీ ప్రజలనే కాదు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలను మోసం చేసింది. మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ కుమారుడు చందన నాగేశ్వర్‌ను వైసీపీ నేతలు కొంతమంది బలవంతంగా రాజకీయాల్లోకి తెచ్చారు. ఎమ్మెల్యే సీటు నీదేనని చెప్పి రూరల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. తర్వాత లేని కార్పొరేషన్‌కు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చైర్మన్ అని ఓ పదవి ఇచ్చారు. అది వట్టిదని తేలడంతో.. బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు.కానీ ఈ కార్పొరేషన్‌కు సొంతంగా నిధుల్లేవు. మునిసిపల్ కార్పొరేషన్ నిధులిస్తే తన పేరిట పార్కులు చేస్తుంది. ఈ పనులు మున్సిపల్ కార్పొరేషన్ సొంతంగా చేసుకోవాలి. కానీ వైసీపీ పెద్దల ఒత్తిడి వల్ల నిధులిచ్చి పనిచేస్తూ ఈ పని బ్యూటిఫికేషన్ పేరిట చేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. దీంతో అదనంగా ఇతరులకు కమీషన్లు ఇవ్వడంతప్ప మరో ప్రయోజనం లేదు. ఇటీవల రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ పదవిని మేడపాటి షర్మిళారెడ్డికి ఇచ్చారు. ఆమెకు రుడా రెండోసారి ఇచ్చి క్యాన్సిల్ చేసి మరీ ఈపదవి ఇచ్చారు. కానీ ఇంత వరకూ పైసా పనిచేసే అవకాశం ఆమెకు దక్కలేదు. ఇదీ వైసీపీ కార్పొరేషన్ల బండారం. ఏదో పదవి ఉన్నట్టు చెప్పుకోవడానికే పనిచేస్తోంది. ప్రభుత్వం ఏదో ఒకరికో ఇద్దరికో పార్టుటైం ఉద్యోగాలు ఇచ్చినట్టుగా ఈ పదవులను అంట గట్టింది తప్ప. ప్రయోజనం ఏమీ కనిపించడంలేదని అందరిలోనూ అంతర్మథనమే.

టీపొడి రీప్యాకింగ్.. రెండు కేసులు నమోదు



రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీపొడిని హోలోసేల్‌గా కొనుగోలు చేసి రిటైల్‌గా ప్యాకింగ్ చేసే దుకాణాల్లో విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి తనిఖీలు చేశారు. నందిని టీ ట్రేడర్స్‌లో సోదాలు చేయగా సింథటిక్ ఫుడ్ కలర్‌ను టీపొడి రంగును కృత్రిమంగా మెరుగుపరచడానికి కలుపుతున్నట్టు గుర్తించామన్నారు. టీపొడిని కల్తీ చేయడానికి ఉపయోగిస్తున్న టార్టాలిన్ 1.4 కిలోలు, సన్‌సెట్ పసుపు 4 కిలోలు, బ్రిలియంట్ బ్లూ పావుకిలో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ప్యాకింగ్, కన్స్యూమర్ కేర్ వివరాలు లేవన్నారు. దీంతో రెండు కేసులు నమోదు చేశామని ఎస్పీ చెప్పారు. వాణిజ్య అవసరాలకు వాడుతున్న 4 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. భారతి ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేసి ప్యాకింగ్ వివరాలు లేకపోవడం గుర్తించామన్నారు. ఆ సంస్థపై కూడా రెండు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు,సిబ్బంది నాగ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం పొగాకుబోర్డులో పొగాకు పరిశీలిస్తున్న బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, ఆర్ఎం ఆదిశేషయ్య

ఈ ఏడాది 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గోపాలపురం, మార్చి 6: బోర్డు నిబంధనలకు లోబడి పొగాకుసాగు చేయడం ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయవచ్చని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గతేడాది బోర్డు అనుమతికి మించి అదనపు పంట పండించినప్పటికి రైతుఉలకు ఆశాజనకమైన ధరలను కల్పించామన్నారు. ఈ ఏడాది 9.9 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు అనుమతివ్వగా 12.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామన్నారు. రైతులు అదనంగా పండించే పంటపై అపరాధరుసుంపై ఆందోళన చెందవద్దన్నారు. సరాసరి గిట్టుబాటు ధర కల్పించే విధంగా కంపెనీ ప్రతి నిధులతో ఢిల్లీ స్థాయిలో సంప్రదింపులు చేస్తామన్నారు. రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పొగాకుబోర్డు మాజీ డైరెక్టర్ గద్దే శేషగిరిరావు, రాజేంద్రప్రసాద్ తదితర రైతులు ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పొగాకు రైతులకు ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. బోర్డు చొరవతో కొనుగోలు స్థాయిని పెంచి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య,ఆక్షన్ సూపరిండెంటెండ్ శ్యామ్, ఎస్‌జీవో హేమస్మిత, పిన్నమనేని మధుమోహన్, జగదీష్, నందమూరి సత్యనారాయణ, ఉండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో కేజీ రూ.240

దేవరపల్లి, మార్చి 6: పొగాకు ధరలు రైతులను నిరాశపరిచాయి. ఈ మేరకు పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు వేలం ప్రారంభమైంది. చెరుకుమిల్లి గ్రామానికి చెందిన 18 పొగాకుబేళ్ళు వేలానికి వచ్చాయి. వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ వేలం నిర్వహించారు. గరిష్ఠ ధర కిలో రూ.240 ధర పలికింది.ఈ ఏడాది కిలో సరాసరి ధర రూ.300 ఉంటేనే కానీ గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొగాకు కంపెనీ ప్రతినిధులు ఐటీసీ ప్రతినిధి కోట్రిస్, పీఎస్ఎఫ్ కంపెనీ ప్రతినిధి సీతారామరాజు,మరో 6కంపెనీల ప్రతినిధులు, రైతులు యాగంటి సాయిబాబు, కరుటూరి శ్రీనివాస్, రాజేంద్రబాబు, కాట్రు భీమరాజు, దుద్దుకూరి హరిబాబు,కాట్రు వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీలను నాశనం చేసిన సీఎం జగన్

- సొంత నిధులు రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాల్
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణం
- పడమర చోడవరం సర్పంచ్ హిమబిందు

నల్లజర్ల,మార్చి 6 : వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌గా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని పడమర చోడవరం సర్పంచ్ పెండ్యాల హిమబిందు చందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో సొంత నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం సర్పంచ్ భర్త చందు తల్లిదండ్రులు పెండ్యాల నరసింహమూర్తి,నాగరత్నం దంపతులు ప్రారంభించారు. సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ నుంచి నిధుల్లేకపోవడంతో తామే స్వయంగా రూ.12 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించినట్టు చెప్పారు.రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన పార్టీలను గెలిపించుకోవాలన్నారు.గ్రామ పంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్ పార్టీని ఓడించాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి,కూచిపూడి వెంకటేశ్వరరావు, ఆలపాటి వెంకట సుబ్బారావు, మద్దిపాటి సుబ్బారావు,ఉప్పు నరేష్,ఉండవల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్లపై ప్రాంతీయ కో ఆర్డినేటర్ సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 : ఇందిరాగాంధి సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ ఉప సంచాలకులు కృష్ణారావు బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇగ్నో అడ్మిషన్లపై సమీక్ష జరిపారు. అనంతరం స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల, కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలను ఆయన సందర్శించి విద్యార్థులకు ఇగ్నో అందిస్తున్న సర్టిఫికెట్, డిప్లమో కోర్సులపై అవగాహన కల్పించారు. కోర్టు కాంప్లెక్స్‌లోని రాజమండ్రి బార్ అసోసియేషన్‌ను సందర్శించి న్యాయవాదులకు ఇగ్నో అందిస్తున్న కోర్సులను వివరించారు. ఇగ్నో ప్రవేశాలకు మార్చి 10తో గడువు ముగుస్తుందన్నారు.



కుందులను పరామర్శిస్తున్న చింతమనేని ప్రభాకర్

కుందులను పరామర్శించిన చింతమనేని

పెరవలి, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వ అసమర్థక విధానాలకు విసుగుపోయిన ప్రజానీకం రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించ డం ఖాయమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ నాయకులు కుందుల వీరవెంకట సత్యనారాయణను ఆరోగ్యరీత్యా గుండెకు స్టంట్ వేసుకోవడంతో బుధవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ టీడీపీ, జనసేన కలవడంవల్ల మరింత బలం పెరి గిందని, దీంతో వైసీపీలో వణుకు మొదలైందని దీంతో టీడీపీ నాయకులపై అక్రమ కేసులుబనాయించి టీడీపీ నాయకులను భయపెట్టే వారి ఆటలు సాగవన్నారు. టీడీపీ ప్రకటించిన మొదటి విడత అభ్యర్థుల లిస్టులో దెందులూరు నియోజకవర్గం నుంచి తన పేరును ప్రకటించకపోవడంపట్ల తాను అసంతృప్తిగా లేనని అధిష్టానం నిర్ణయం ప్రకారం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి సహకరిస్తానన్నారు.

రైతులకు సేవలందించడంలో సొసైటీల కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్

దేవరపల్లి, మార్చి 6: రైతులకు సేవలందించటంలో సహకార సంఘాలు కృషిచేస్తున్నాయని సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీని వాస్ అన్నారు. దేవరపల్లిలో సొసైటీ కార్యాలయంలో సొసైటీ మహాజనసభ కార్యదర్శి కల్లూరి శ్రీనివాస్‌శర్మ అధ్యక్షతన బుధ వారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మా ట్లాడుతూ దేవరపల్లి సొసైటీ ఏర్పడినప్పటి నుంచి సొసైటీ ద్వారా రైతులకు డీసీసీబీ అధికారులు, సొసైటీ సిబ్బంది, ప్రజాప్రతి నిధుల సహకారంతో సొసైటీ దినదినాభివృద్ధి చెం దిందన్నారు. సొసైటీ రూ.కోటి 16లక్షలు షేర్‌ధనం కలిగి ఉందన్నారు. 8కోట్ల 33లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రైతులకు రుణా లు 18కోట్ల 89లక్షలు ఇచ్చారన్నారు. 2024-25 సంవత్సరానికి రూ.7కోట్ల 35లక్షల నిధుల అంచనాతో బడ్జెట్ ఏర్పాటుచేసి ఆమోదించామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మంచిలి కటాక్షం, మాజీ సొసైటీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, కడిమి రాజు, కొండపల్లి దొరయ్య, ఉండవల్లి కృష్ణారావు, పైడికొండల సత్యనా రాయణ పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



నల్లజర్లలో పల్స్ పోలియో పంపిణీపై వివరాలు సేకరిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

నల్లజర్ల, మార్చి 6: ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతున్న పల్స్ పోలియో చుక్కల పంపిణీపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. బుధవారం నల్లజర్ల మండలంలో పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం పల్స్ పోలియో చుక్కల పంపిణీ,ప్రజారోగ్య పనితీరుపై వివరాలు సేకరించారు. మండలంలో వైద్య సేవలు భేష్‌గా ఉన్నట్లు నల్లజర్ల పీహెచ్‌సీ బృందాన్ని అభినందించారు. డీపీఎంవో డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జె.కుమారస్వామి,వసంతలక్ష్మి ఒక బృందంలో ఉండగా మరో బృందంలో వైద్యులు ప్రణయ్, సురేష్ ఉన్నారు. డాక్టర్ గంగాధర్, జీ.వి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలి

ఉండ్రాజవరం, మార్చి 6 : కోడిగుడ్ల ప్యాకింగ్, లోడింగ్ కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్. సుందర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉండ్రాజవరంలో గోదావరి ఎగ్ ప్యాకింగ్, లోడింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మొండి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉండ్రాజవరం, తణుకు పరిసర ప్రాంతాల్లో కార్మికులు సుమారు 1000 మంది వరకు ఉన్నారని తెలిపారు. కోళ్లఫారాలు వద్ద లోడింగ్, ప్యాకింగ్‌చేసే సమయంలోను, ప్రయాణంలో భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. వారాంతపు సెలవు, ఓవర్‌టైమ్ వంటి సదుపాయాలు కల్పించాలని సుందరబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శి పి.వీ.నరసయ్య, జిల్లా కోశాధికారి కేఎస్‌వీఆర్ రావు, జిల్లా కార్యదర్శి జువ్వల రాం బాబు, సీఐటీయూ నాయకులు గండి కృష్ణ, వీవీ సుబ్బారావు, అబ్బు వెంకటేశ్వరరావు, తూరుగోపు వెంకటేశ్వరరావు, కే. కేదార్, పీవీ నరసయ్య, తానేటి సూరి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం



జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం అందజేస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, మార్చి 6: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి జనసేన ఎప్పుడూ ముందుంటుందని గోపాలపురం నియో జకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు కోమలి సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు గాయం కావడంతో రాజమంహేంద్రవరం సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సువర్ణరాజు బుధవారం రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు కాట్నం గణేష్, జనసేన నాయకులు పాపోలు ప్రదీప్, సంబాల శ్రీనివాస్, పోలుమాటి విక్రాంత్, మళ్ళిపూడి కిరణ్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

కొవ్వూరు, మార్చి 6 : కొవ్వూరు మండలం పశివేదల గ్రా మంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన భవనంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంలో గతంలో ఇచ్చిన ఇళ్లపట్టాలను రిజిస్ట్రేషన్ చేసి మరలా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, గ్రామ సర్పంచ్ తుంపల్లి సింహాచలం వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని దొమ్మేరులో గ్రామస్థాయి బూత్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించి ఎన్నికలకు సంబంధించి దిశ, నిర్దేశం చేశారు.

థర్డ్ ఫేజ్‌లో భూహక్కు పథకం రీ సర్వే



తాళ్ళపూడి, మార్చి 6: జగనన్న భూహక్కు పథకంలో రీ సర్వే థర్డ్‌ఫేజ్ కొనసాగుతుందని జిల్లా సర్వేయర్ జోషిలా తెలిపారు. బుధవారం తాళ్ళపూడి మండలానికి విచ్చేసిన జోషిలా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేపట్టిన భూహక్కు పథకంలో రెండు ఫేజ్‌లు పూర్తి చేశామని జరిగిన సర్వేలలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లైతే వాటిని తమ సిబ్బంది ఒక వారంలో పరిష్కరిస్తారని, జిల్లాలో మొత్తం 273 గ్రామాలకు రీ సర్వే పూర్తిచేస్తున్నామన్నారు. సర్వేలో మిగిలిన గ్రామాలలో మూడోఫేజ్ సర్వే చేస్తామని అనివార్య కారణాలవల్ల సర్వే పూర్తి కాకుంటే నాల్గవ ఫేజ్‌లో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలు, రైతులు రీ సర్వే సిబ్బందికి సహకారం అందించాలని అన్నారు. మండల సర్వేయర్ వీరాస్వామి, డీటీభారతి పాల్గొన్నారు.

టీడీపీ బీసీ డిక్లరేషన్‌తో వైసీపీ వెన్నులో వణుకు

- 10న రాజమహేంద్రవరంలో ఎన్నికల శంఖారావం సభ
- టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: తమ నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు బీసీ డిక్లరేషన్ ప్రకటించిననాటి నుంచి వైసీపీ వెన్నులో వణుకు మొదలైందని ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉందన్నారు. పార్టీకి ఎల్లప్పుడు అండదండగా ఉన్న బీసీల రుణం తీర్చుకునేందుకే బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు ప్రకటించారని చెప్పారు. దీంతో బీసీ దిశ దశ మారబోతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌పై ఇష్టానుసారం మాట్లాడుతున్న మంత్రి వేణు ఏనాడో జాతి ఆత్మగౌరవాన్ని పెద్దరెడ్ల కాళ్లదగ్గర తాకట్టు పెట్టాడని విమర్శించారు. ఇక సోదరుడు ఎంపీ భరత్ రామ్‌కు దమ్ము వుంటే బీసీ డిక్లరేషన్ చూసి సిగ్గు తెచ్చుకుని జగన్ వద్దకు వెళ్లి ఇంతకంటే ఘనంగా బీసీలకు ఏదైనా చేస్తాడెమో అడిగి సాధించుకోవాలని సూచించారు. అంతే తప్ప సినిమాలో డైలాగ్‌లు చెప్పవద్దన్నారు. ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. బీసీలలో ఉన్న 157 కులాలకు న్యాయం చేసే బాధ్యత టీడీపీ -జనసేన తీసుకుంటాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో ఈనెల 10న ఎన్నికల శంఖారావం సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బుడ్డిగ రాధా, నక్కా దేవి వరప్రసాద్, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, బుడ్డిగ రవి, పితాని పైడిరాజు, ధర్మ, మాజీ కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, బాబీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టండి

- టీడీపీ జోన్ 2 కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు

అనపర్తి, మార్చి 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జోన్ 2 కోఆర్డినేటర్ రావు వెంకటసుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బిక్కవోలులో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశక్తి పథకాల ప్రచార కార్యక్రమంలో ఆయన టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధి లేకున్నా అరాచకాలకు కొదవలేదన్నారు. అనపర్తి నియోజకవర్గంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 90శాతం మహాశక్తి పథకాల ప్రచారం పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, చిట్టిబాబు చౌదరి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, మల్లేశ్వరి, బేరా వేణమ్మ, చిన్నమ్మ, పోతంశెట్టి సుబాషిణి పాల్గొన్నారు.



అనపర్తి: మహాశక్తి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జోన్- 2 కోఆర్డినేటర్ రంగారావు, నల్లమిల్లి

బీసీలను చట్టసభల్లో కూర్చోబెట్టింది టీడీపీనే

కొవ్వూరు, మార్చి 6: బీసీలను గుర్తించి చట్టసభలలో కూర్చోపెట్టింది తెలుగుదేశం పార్టీయేనని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు అర్జిల్లి రామకృష్ణ అన్నారు. తెలుగుదేశంపార్టీ జయహో బీసీ సదస్సు విజయవంతం కావడంపై బుధవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బీసీ నాయకుల సక్సెస్‌మీట్ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మాటవిని బీసీలంతా మోసపోయారు. గతంలో జరిగిన పొరపాటు మరలా జరగకుండా రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుంటామన్నారు. కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు కాగిత రఘు మాట్లాడుతూ జయహో బీసీ సదస్సులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు బీసీల అభివృద్ధి వరాలజల్లు కురిపించారన్నారు. 50 సంవత్సరాలకే పింఛను, అధికారం చేపట్టిన 5 సంవత్సరాల్లో లక్షన్నర కోట్లు సబ్‌ప్లాన్‌కు కేటాయించడం ఆనందదాయకమన్నారు. ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండా వైసీపీ 54 కార్పొరేషన్లు పేరుతో బీసీలను మభ్యపెట్టి మోసం చేసిందన్నారు. బీసీ సదస్సులో బీసీలలో ఉన్న ప్రతి ఉపకులానికి కులవృత్తుల వారీగా ప్రాధాన్యం కల్పిస్తామని అది నాయకులు వివరించారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రకటించిన బీసీలకు ప్రత్యేక డిక్లరేషన్, బీసీలపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి టీడీపీకి వెన్నుముక బీసీలని మరోసారి నిరూపించుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజాన శ్రీనివాస్, ఎం.చక్రపాణి, యార్లగడ్డ వీరభద్రం, రంబా హరిబాబు, ఎండీ బహద్దూర్, పిక్కి కొవ్వూరు, షైలపల్లి సుందరరావు, చింతపల్లి మహేష్, పిక్కి గంగధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

మహా శివరాత్రి ఏర్పాట్లు పూర్తి

రేపు సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి



గోలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం దృశ్యం



గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి కల్యాణం దృశ్యం

నిడదవోలు, మార్చి 6: నిడదవోలు పట్టణంలో ఉన్న బాలా త్రిపుర సుందరి సహిత సోమేశ్వర స్వామి పంచాహ్నిక క్షేత్రంలో 8వ తేదీ శుక్రవారం మహా శివరాత్రి, మాస శివరాత్రి సందర్భంగా తెల్ల వారుజాము నుంచి ప్రత్యేక అభి షేకాలు అర్చనలు నిర్వహి స్తున్నా మని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి తెలిపారు. అదేరోజు రాత్రి 7 గంట ల నుంచి తెల్లవారుజామున 4.30 వరకు లక్ష పత్రిపూజ, లక్ష కుంకు మార్చన, మహాశివరాత్రి జాగరణ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయకార్య నిర్వహణాధికారి కోరారు.

గోలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

నిడదవోలు పట్టణంలో ఉన్న రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సుందరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

కొవ్వూరు, మార్చి 6 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉన్న శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్వామివారి కల్యాణా నికి సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాసన, త్రిశూల పూజ, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిముఖము, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం 6-30కు హైదరాబాద్‌కు చెందిన ముద్దు వెంకటసాయికృష్ణ, వినయ్‌సాయి సత్యవేణి దంపతులు పీటలపై కూ ర్చు ని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత సుందరేశ్వరస్వామి కల్యాణం జరిపించారు.

వైభవంగా గోష్పదేశ్వరస్వామి కల్యాణం

కొవ్వూరు, మార్చి 6 : కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీ లలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వ ర్యంలో గోష్పదేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ



రామన్నపాలెంలో శివాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠకు హాజరైన మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, మార్చి 6: దేవరపల్లి మండలం రామన్నపాలెం శివాలయంలో బుధవారం జరిగిన విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరై శివాలయంలోని ఉమా రామ లింగేశ్వర స్వామి విగ్రహపు నఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంత్రి తానేటి వనితకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుచుపూడి బుల్లారావు, మాజీ సర్పంచ్ కూచిపూడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు ప్రారంభం

కొవ్వూరు, మార్చి 6 : విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం అన్ని ప్రైవేటు మేనేజ్‌మెంటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కొవ్వూరు మండల విద్యాశాఖాధికారులు జె.కెంపురత్నం, జె. రామకిషోర్‌లు తెలిపారు. ఈ అడ్మిషన్లలో అనాథపిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు (గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ. 1,20,000లు, పట్టణ ప్రాంతాలలో రూ. 1,44,000లు లోబడి ఆదాయం కలిగిన కుటుంబాల్లోని పిల్లలు) 6 శాతం, మొత్తంగా 25 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన పోర్టల్ (వెబ్ సైట్ లాగిన్ హెచ్‌టిటిపి://సిఎస్‌ఇ.ఏపి.జిఓవి.ఇన్)లో నమోదు చేసుకోవాలన్నారు. అర్హతకలిగిన అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాలుగాని, ఏదైనా నెట్ సెంటర్‌లోని దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

తాళ్ళపూడి: రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరంలో 1వ తరగతి ఉచిత అడ్మిషన్లు కోసం అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నెహ్రూరాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కావలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాశాఖాధి వారి కార్యాలయంలోగానీ, సమీప సచివాలయంలోగానీ కానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

దేవరపల్లి: విద్యాహక్కు చట్టం ప్రకారం దేవరపల్లి మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి బడుగు, పేద, బలహీనవర్గాల పిల్లలకు అనాథ, హెచ్‌ఐవీ బాధిత దివ్యాంగుల పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలైన బీసీ, మైనార్టీలకు 6శాతం ఉచిత ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని దేవరపల్లి మండల విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాసు బుధవారం విలేఖర్ల సమావేశంలో తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్ళపూడి, మార్చి 6 : మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో బుధవారం లైన్స్‌క్లబ్, యువగళం టీం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారని అందులో 30మందికి ఉచిత కళ్లజోళ్లు అంది స్తున్నామని 20మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో లకంసాని రామశేషగిరి, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, డాక్టర్ సిహెచ్ నాగరాజు, సీహెచ్ శ్రావణి, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంది

ఉండ్రాజవరం, మార్చి 6 : ప్రభుత్వం పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి ఆదుకుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. గురువారం ఉండ్రాజవరంలో జరిగిన సమావేశంలో ఉండ్రాజవరం, పాలంగి, కెసావరం, సూర్యారావుపాలెం, వడ్లూరు, చివ టం, మోర్త తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయసలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ స్కూల్‌కి స్టేజ్ షెడ్ నిర్మాణం

నిడదవోలు, మార్చి 6: నిడదవోలు పట్టణంలోని జిల్లా పరి షత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం రోటరీ సెంట్రల్ ఆధ్వ ర్యంలో స్టేజ్‌మీద స్టేజ్‌షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) ఆర్థిక సహకారంతో విద్యార్థినీలకు ఉపయోగపడేలా స్టేజ్‌మీద షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ముళ్ళపూడి వెంకట్రావు, నీరుకొం డ సుబ్రహ్మణ్యం, బిఎస్‌వి ప్రసాద్, గంపా వెంకట కృష్ణారావు, యాదర నాగేశ్వరరావు, చైన్లు రాజా ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

- నన్నయ ఉపకులపతి పద్మరాజు



భూమిపూజ చేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 6: ప్రస్తుతం చేపడుతున్న అన్ని పనులను వేగ వంతంగా పూర్తిచేసి అనుకున్న సమయానికి భవనాలు అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కాంట్రాక్టర్లను కోరారు. రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంగణాలలో రూ.37.78కోట్లతో అభివృద్ధి పనులకు బుధవారం పూజా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో చాలాకాలంగా నిలిచిపోయిన భవన నిర్మాణపనులను తిరిగి ప్రారంభించ డానికి పూజలు చేశామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రాంగ ణంలో రూ.20.05కోట్లతో విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల భవనం, రూ.8.25 కోట్లతో ఎగ్జామినేషన్ భవనం, రూ.1.90 కోట్లతో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవన పునః నిర్మాణాలు, రూ.8.3లక్షలతో పార్కింగ్ షెడ్ నిర్మాణాలు జరుగుతా యన్నారు. కాకినాడ ఎంఎస్ క్యాంపస్‌లో రూ.3కోట్లతో రహదారులు రూ.4.5కోట్లతో నూతన మహిళా వసతి గృహం నిర్మిస్తున్నామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిధులతో ఏపీఈ డబ్ల్యుఐడీసీ వారిచే పునః నిర్మాణపనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ ఇంజనీర్లు కె.నూక రత్నం, ఎ.ఇ.ఇ. ఎన్.దీప్తి, ఈసీ సభ్యుడు గంధం నారాయణరావు, ఎ.పి.ఈ. డబ్ల్యు.ఐ. డి.సి. ఈఈ జయకర్, ఆర్అండ్‌బీ డీఈ మధుసూధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరోబిక్స్‌తో ఆరోగ్యం, మానసికోల్లాసం

- ఆర్ట్సకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు



ఏరోబిక్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6: చారిత్మతక ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరోబిక్స్‌తో ఆరోగ్యం మానసికోల్లాసం కలుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామచంద్రరావు అన్నారు.ఆర్ట్సకళాశాల గ్రౌండ్‌లో బుధవారం ఉద యం 6గంటలకు ఏఎస్పీ పి.గోపాలకృష్ణ, కంటే వీరన్న చౌదరి, ప్రిన్సిపల్ రామచంద్రరావు ఏరోబిక్స్‌ను ప్రారంభించారు. తొలుత పూర్వ విద్యార్థుల సంఘం టీ షర్టును ఆవిష్కరించారు. అనంతరం ఏరోబిక్ గురువులు విజయ్, వీవీ.లక్ష్మి యువకులు, పెద్దలు, పిల్లలతో ఏరో బిక్స్ చేయించారు.ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ళ మాధవ్ ,ఉపాధ్యక్షుడు భార్గవ్, కార్యదర్శి గద్దే సుధాకర్, కోశాధికారి విజయలక్ష్మి, అలికాన సత్యశివ కుమార్, సభ్యులు కేశంశెట్టి వరప్రసాద్, ఫణి, అధ్యాపకులు పాల్గొన్నారు.